# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948



సంపుటి : 01 సంచిక : 243, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజిలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం -01 - జనవరి - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## దక్షిణకొరియా విమాన ప్రమాదం..
## 181 మందిలో ఇద్దరే ఎలా బతికారు? ఎక్కడ కూర్చున్నారు?



- విమానం వెనుక భాగంలో కూర్చున్న మృత్యుంజయులు
- కాలిపోతున్న తోక భాగం నుంచి ఇద్దర్నీ రక్షించిన రెస్క్యూ సిబ్బంది
- విమానం వెనుక సీట్లలో మరణాల రేటు తక్కువగా ఉందంటున్న గణాంకాలు

## జనవరిలో ఇస్రో 100వ మిషన్..
## నింగిలోకి దూసుకెళ్లనున్న జీఎస్ఎల్వీ



ఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ జనవరి 2025లో జియో సింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ఎన్వీఎస్-02 ప్రయోగం చేపట్ట నున్నది. ఈ మిషన్ కోసం సన్నాహాలు చేస్తుంది. వచ్చే ఏడాది ప్లాన్ చేసిన పలు మిషన్లో జీఎస్ఎల్వీ మిషన్ ఒకటని ఇస్రో చైర్మన్ సోమ్నాథ్ తెలిపారు.

## దేశంలోనే మొట్టమొదటి
## గాజు వంతెన ప్రారంభం.. ఎక్కడ ఉందో తెలుసా..?



ఢిల్లీ : దేశంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో తమిళనాడు రాష్ట్రం ఒకటి. అక్కడ ప్రకృతి అందాలతో పాటు ఎన్నో ప్రముఖ ఆలయాలు ఉన్నాయి. వీటిని చూసేందుకు దేశ నలుమూలల నుంచి ప్రజలు నిత్యం తమిళనాడుకు పోటెత్తుతుంటారు. ఈ నేపథ్యంలో పర్యాటకులను ఆకర్షించేందుకు అక్కడి ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను, మౌలిక వసతులను కల్పిస్తోంది.

## మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో తొలి అరెస్టు



రాష్ట్రంలో సంచలనం సృష్టించడం మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దహనం కేసులో తొలి అరెస్టు జరిగింది. ఈ సంఘటనలో కీలకపాత్ర పోషించిన సబ్ కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితుడికి సహకరించిన కేసుతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్టు చేస్తామని సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ ప్రకటించారు. / కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజులు తర్వాత అంటే జులై 21న అర్ధరాత్రి

# నాకు హైకమాండ్ ఎవరూ లేరు: సీఎం చంద్రబాబు

- పల్నాడు జిల్లా యల్లమంద గ్రామంలో పింఛన్ల పంపిణీ
- ఇంటింటికీ తిరిగి పింఛన్లు ఇచ్చిన సీఎం చంద్రబాబు
- గ్రామంలో ఏర్పాటు చేసిన సభకు హాజరు



అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ (డిసెంబరు 31) పల్నాడు జిల్లా యల్లమందలో పింఛన్ల పంపిణీ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి స్వయంగా

2లో

## ఏపీ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు చెప్పిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఎందుకంటే?



హైదరాబాద్ : తెలంగాణ ప్రజా ప్రతినిధులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. తిరుమల శ్రీవారి దర్శనాల విషయంలో ఊరట కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సంబంధించిన లేఖలు అనుమతించారు. ఈ నిర్ణయంపై తెలంగాణ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా తిరుమల కొండపై శ్రీవారి దర్శనాల్లో తమకు ప్రాధాన్యం దక్కడం లేదని..

## రెండు ఎకరాల చంద్రబాబు వెయ్యి కోట్లు ఎలా సంపాదించారు?: గుడివాడ అమర్ నాథ్



- సూపర్ సిక్స్ అంటూ మోసం చేసి అధికారంలోకి వచ్చారని అమర్ నాథ్ విమర్శ
- తమ పోరాటాలకు ప్రజల నుంచి విశేషమైన స్పందన వస్తోందని వ్యాఖ్య
- వైజాగ్ స్టీల్ ప్లాంట్ పై ప్రభుత్వ వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్

## ఈ ఏడాదంతా దురదృష్టకరమే.. రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పిన మణిపూర్ సీఎం



న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్ రావణకాష్టంలా రగులుతున్న విషయం తెలిసిందే. రెండు జాతుల మధ్య వైరంతో ఏడాదిన్నరగా అట్టుడుకుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన దురదృష్టకర పరిణామాలపై ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ తాజాగా స్పందించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పారు. 2025లో రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. 'ఈ సంవత్సరం మొత్తం చాలా దురదృష్టకరంగా సాగింది. గతేడాది మే 3 నుంచి నేటి వరకు రాష్ట్రంలోని పరిణామాల విషయంలో ప్రజలకు నేను క్షమాపణ చెప్పాలనుకుంటున్నాను. చాలా మంది తమ కుటుంబ సభ్యులను కోల్పోయారు. ఇళ్లను కోల్పోయారు. అందుకు నేను చింతిస్తున్నాను. క్షమాపణలు కోరుతున్నాను. అయితే గత నాలుగు నెలలుగా శాంతి భద్రతల పురోగతిని చూసిన తర్వాత 2025 నాటికి రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని

2లో

# అగ్రగామిగా హైదరాబాద్.. సహకరించండి: సీఎం రేవంత్

- సత్య నాదెళ్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ప్రభుత్వ ప్రయత్నాలకు మైక్రోసాఫ్ట్ మద్దతివ్వాలి
- కంపెనీ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్లకు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- ఏఐ, జెన్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌పై ప్రభుత్వం దృష్టి పెడుతున్నట్లు వెల్లడి.. మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌తో కలిసి భేటీ
- ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటామన్న సత్య నాదెళ్ల



హైదరాబాద్: సాంకేతిక రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏఐ, జెన్ (జెనరేటివ్) ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ తదితరాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోందని, ఈ నేపథ్యంలో వివిధ సాంకేతిక అవసరాలకు అనుగుణంగా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. సీఎం సోమవారం.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి బంజారాహిల్స్‌లోని సత్య నాదెళ్ల నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు.

## కాఫీ తయారు చేసి లబ్ధిదారులకు ఇచ్చిన చంద్రబాబు



- ఏడుకొండలు కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకుని, అతను దుకాణం పెట్టుకునేందుకు బిసి కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల రుణం ఇప్పించాలని అధికారులకు ఆదేశించారు
- శారమ్మ ఇంటికి వెళ్లి పింఛన్ నగదు సిఎం చంద్రబాబు అందజేశారు.

అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేశారు. పల్నాడు జిల్లాలోని యలమందలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్లు పంపిణీ చేశారు.

# కాంగ్రెస్ 3డీ రాజకీయాలు

## డిస్ట్రక్షన్.. డిస్ట్రాక్షన్.. డైవర్షన్ పాలిటిక్స్



- 2024 కాంగ్రెస్ ధోకా నామ సంవత్సరం రైతు భరోసా పేరుతో
- సంక్రాంతికి మరో మోసం
- నాపై పసలేని కేసులు పెట్టారు.. అది సిఎం
- రేవంత్‌కు కూడా తెలుసు భయపడేది లేదు..
- న్యాయపరంగా ఎదుర్కొంటాం సినిమా వాళ్లతో సెటిల్‌మెంట్ చేసుకొని
- ఇప్పుడు నోరు మెదపడం లేదు : మీడియాతో కెటిఆర్ చిట్‌చాట్

హైదరాబాద్ : రైతు భరోసా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్రాంతికి మరో మోసం చేసేందుకు సిద్ధమైందని బిఆర్ఎస్ వ ర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. రైతు భరోసాను ఎగ్గొట్టడం, బిసిలను మోసగించడం అనే రెండు ప్రయత్నాలతో 2025 నూతన సం వత్సరాన్ని కాంగ్రెస్ ప్రారంభించబోతుందని వి మర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం కెటిఆర్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కొత్త ఏడాదిలో రైతులను మోసం చేయటానికి సిఎం రేవంత్ రెడ్డి ప్లాన్ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొ ట్టి రైతుల నోట్లో మట్టికొట్టిందని, 26 వేల కోట్ల రూపాయలను రాష్ట్ర రైతాంగానికి రైతు భరోసా ఎగ్గొట్టడం వల్ల బాకీ పడిందని అన్నారు. రైతు భరోసా ఎవరికి ఇస్తారు అనే విషయంలో ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. రూ.72,000 కో ట్లు సాఫీగా రైతుల ఖాతాలోకి పోయిన కార్యక్రమాన్ని గందరగోళంగా మారుస్తున్నదని, అంతిమంగా ఈ వ్యవహారం అవినీతికి దారి తీస్తుంద ని పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని చెప్పారు. కాంగ్రెస్ నేతలకు చెందిన వాళ్లతోనే కోర్టులో

2లో

## తెలంగాణాలో టీడీపీ విస్తరణ సాధ్యమేనా ?




హైదరాబాద్ : తెలంగాణాలో టీడీపీ విస్తరణ సాధ్యమేనా ? తెలుగుదేశం పార్టీ తెలంగాణాలో పార్టీని మళ్లీ విస్తరించి పటిష్టం చేయాలని చూస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబుకు తెలంగాణా మీద ఎపుడూ ఆ కోరిక ఉంటూనే ఉంది. ఎందుకు అంటే ఆయన ఉమ్మడి ఏపీకి తొమ్మిదేళ్ళ పాటు సీఎం గా పనిచేశారు. తెలంగాణాను ఎంతగానో అభివృద్ధి చేశారు. ప్రత్యేకించి సైబరాబాద్ సృష్టికర్తగా కూడా ఉన్నారు. / అందువల్ల చంద్రబాబుకు తెలంగాణా ప్రజల మీద అక్కడ పార్టీ విస్తరణ మీద ఆశలు చాలా ఉన్నాయి. అందుకే ఆయన ఇటీవల పనిగట్టుకుని మరీ ప్రశాంత్ కిశోర్ టీం తో సర్వే చేయించారు అని అంటున్నారు. పార్టీ అక్కడ విస్తరించేందుకు గల అవకాశాలు ఏ మాత్రం ఉన్నాయని ఆయన ఆలోచిస్తున్నారు అంటున్నారు. అయితే ఈ సర్వేలో కీలక విషయాలు బయటకు వచ్చాయని చెబుతున్నారు.

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక
బుధవారం - 01 - జనవరి - 2025

## దక్షిణకొరియా విమాన ప్రమాదం..

## 181 మందిలో ఇద్దరే ఎలా బతికారు? ఎక్కడ కూర్చున్నారు?

న్యూఢిల్లీ : దక్షిణకొరియాలోని ముయాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం 'జెజు ఎయిర్'కు చెందిన ప్యాసింజర్ విమానం రన్‌వేపై కూలిన విషయం తెలిసిందే. ఈ పెనుప్రమాదానికి సంబంధించి దృశ్యాలు హృదయాలను కలచివేశాయి. విమానంలో ప్యాసింజర్లు, సిబ్బంది కలిపి మొత్తం 181 మంది ప్రయాణించగా 179 మంది మృత్యువాతపడ్డారు. ఇద్దరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. వారిద్దరూ విమాన సిబ్బందే కావడం గమనార్హం. మరి, అంతమంది చనిపోయిన ఘోర ప్రమాదంలో వీళ్లిద్దరూ ఎలా బతికారు?, విమానంలో ఎక్కడ కూర్చున్నారు? అనేది ఆసక్తికరంగా మారింది. అయితే, ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరూ విమానం వెనుక భాగంలో కూర్చున్నారు. విమాన ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే కమర్షియల్ ఫ్లైట్స్‌లో వెనుక భాగాలు కొంతలో కొంత సురక్షితమైనవని నివేదికలు పేర్కొంటున్నాయి. విమాన ప్రమాదాలపై 2015లో 'టైమ్ మ్యాగజైన్' నిర్వహించిన ఒక అధ్యయనంలో వెనుక సీట్లలో మరణాల రేటు కాస్త తక్కువగా ఉన్నట్టు తేలింది. మరణాల రేటు విమానాల మిడిల్ సీట్లలో 39 శాతం, ముందు సీట్లలో 38 శాతం, వెనుక సీట్లలో 32 శాతంగా ఉందని తెలిపింది. కాగా, దక్షిణకొరియాలో జరిగిన విమాన ప్రమాదంలో 32 ఏళ్ల లీ, 25 ఏళ్ల క్వాన్ అనే ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. మంటల్లో తగలబడిపోతున్న విమానం వెనుక భాగం నుంచి వీరిద్దరినీ రెస్క్యూ సిబ్బంది రక్షించారు. స్పృహలోకి వచ్చిన లీ... తనకు ఏమైందని, తాను ఎక్కడ ఉన్నానంటూ పదేపదే అడుగుతోందని వైద్యులు సోమవారం ప్రకటించారు. లీ ఎడమ భుజం విరిగిపోగా, తలపై గాయాలయ్యాయని వైద్యులు తెలిపారు. ఇక క్వాన్‌కి చీలమండ విరిగిదని, తీవ్ర కడుపునొప్పితో అతడు బాధపడుతున్నారని వివరించారు.

## జనవరిలో ఇస్రో 100వ మిషన్..

## నింగిలోకి దూసుకెళ్లనున్న జీఎస్ఎల్‌వీ

మొదటి పేజి తరువాయి

ఇస్రో సోమవారం రాత్రి విజయవంతంగా స్పాడెక్స్ మిషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సోమ్‌నాథ్ ఈ ప్రకటన చేశారు. మే 29, 2023న జీఎస్ఎల్‌వీ-ఎఫ్12 రాకెట్ ఎన్ఎస్‌వీ-01 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ లోకి విజయవంతంగా ప్రవేశపెట్టిందని సోమ్‌నాథ్ పేర్కొన్నారు. ఎన్‌వీఎస్-04 ఉపగ్రహంలో స్వదేశీ అటామిక్ క్లాక్ ఉంటుందన్నారు. ఇది ఇండియన్ కాన్స్టెలేషన్ తో నావిగేషన్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. కవరేజ్ కోసం ఎల్1 బ్యాండ్ సిగ్నల్ కలిగి ఉంటుందన్నారు. ఎన్‌వీఎస్-2 మిషన్‌తో మరింత పురోగతి సాధించాలని భావిస్తున్నామన్నారు. అధునాతన ఫీచర్స్‌తో నావిక్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు.

చంద్రయాన్-4పై కీలక సమాచారం..

ఇస్రో చీఫ్ ఈ సందర్భంగా చంద్రయాన్-4 మిషన్‌పై కీలక సమాచారాన్ని వెల్లడించారు. మిషన్‌లో వివిధ మాడ్యూల్స్ ఉంటాయని.. వేర్వేరు సమయాల్లో ప్రయోగించనున్నట్లు తెలిపారు. రెండు వేర్వేరు మాడ్యూల్స్‌లో ఒకేసారి కలుపనున్నట్లు తెలిపారు. ఈ మాడ్యూల్స్ కక్షలోకి చేరుకోవాల్సి ఉంటుందని.. ఆ తర్వాత భూమి కక్ష్య, చంద్రుడి కక్ష్యలో రెండింటిలోనూ డాక్ చేయాల్సి ఉంటుందన్నారు. చంద్రుడిపై దిగి విజయవంతంగా తిరిగి రావడమే చంద్రయాన్-4 లక్ష్యమని సోమ్‌నాథ్ స్పష్టం చేశారు. స్పాడెక్స్ మిషన్‌లో పంపిన రెండు ఉపగ్రహాల డాకింగ్ జనవరి 7 వరకు పూర్తవుతుందన్నారు. చంద్రయాన్-4కి ఇది పరీక్ష లాంటిదన్నారు. డాకింగ్ ప్రక్రియ సోమవారం మొదలవుతుందని.. ఇందులో అనేక ప్రక్రియలుంటాయన్న ఆయన.. డాకింగ్ తుది ప్రక్రియ జనవరి 7వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఇస్రోకి స్పాడెక్స్ మిషన్ కీలక మైలురాయి అని ఇస్రో చైర్మన్ తెలిపారు. వచ్చే ఏడాది 100వ ప్రయోగానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు.

## దేశంలోనే మొట్టమొదటి

## గాజు వంతెన ప్రారంభం.. ఎక్కడ ఉందో తెలుసా..?

మొదటి పేజి తరువాయి

ఇందులో భాగంగానే దేశంలోనే మొట్టమొదటిసారిగా గ్లాస్ బ్రిడ్జ్ ను నిర్మించింది. బంగాళాఖాతం మధ్యన ఏర్పాటు చేసిన ఈ గాజు వంతెన ను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం ప్రారంభించారు. కన్యాకుమారి తీరంలో వివేకానంద స్మారక మండపానికి 77 మీటర్ల దూరంలో 2000 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో తిరువళ్లువర్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆ విగ్రహ ప్రతిష్టాపన జరిగి జనవరి 1వ తేదీకి 25 ఏళ్లు పూర్తవుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తమిళనాడు ప్రభుత్వం రెండు రోజులపాటు సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే వివేకానంద మండపం, తిరువళ్లువర్ విగ్రహాన్ని కలిపేలా దేశంలోనే మొదటిసారి సముద్రం మధ్యన ఈ గాజు వంతెనను తమిళనాడు ప్రభుత్వం నిర్మించింది.

## మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో తొలి అరెస్టు

మొదటి పేజి తరువాయి

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగి కార్యాలయం మొత్తం మంటల్లో మసైపోయింది. ఈ సబ్ కలెక్టరేట్ పరిధిలోని పలు భూ కుంభకోణాలు చోటుచేసుకున్నాయని, వైసీపీ హయాంలో కీలకంగా పనిచేసిన ప్రధాన నాయకుడు తన అనుచరుల పేరిట వందల ఎకరాల భూములను రాయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం వచ్చిన కొత్తలోనే కలెక్టరేట్లో మంటలు పుట్టడం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. అప్పట్లో ఈ సంఘటనను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఈ సంఘటన ఎలా జరిగిందో విచారించాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలతో డీజీపీ ద్వారకా తిరుమలరావు హుటాహుటిన మదనపల్లె చేరుకుని, ఇది యాక్సిడెంట్ కాదు ఇన్సిడెంట్ అని తేల్చారు. ఎవరో కావాలనే కార్యాలయానికి నిప్పుపెట్టినట్లు అనుమానించిన డీజీపీ.. కేసు విచారణను సీఐడీకి అప్పగించారు. ఈ కేసు విచారాణాధికారిగా సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ ను నియమించారు. మరోవైపు మదనపల్లె సబ్ కలెక్టరేట్ దహనంపై రెవెన్యూ శాఖ కూడా అంతర్గతంగా విచారణ చేపట్టింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు, అనుచరులు భూ దందాలకు పాల్పడినట్లు బాధితులు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాకు ఫిర్యాదు చేశారు. ఇలా ఇటు రెవెన్యూ, అటు సీఐడీ ఈ కేసును చాలెంజింగ్ గా తీసుకుని విచారణ చేపట్టాయి. కేసుతో సంబంధం ఉందని పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు.. ఆ రోజు కార్యాలయంలో అర్ధరాత్రి వరకు ఉన్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్ ను ఎట్టకేలకు అరెస్టు చేశారు. అతడే ఈ కేసులో మొదటి ముద్దాయని సీఐడీ డీఎస్పీ తెలిపారు. నిందితుడిని చిత్తూరు కోర్టులో హాజరుపరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో కేసులో మరింత మందిని త్వరలో అరెస్టు చేసే అవకాశం ఉందంటున్నారు.

## రెండు ఎకరాల చంద్రబాబు వెయ్యి కోట్లు

## ఎలా సంపాదించారు?: గుడివాడ అమర్ నాథ్

అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ తీవ్ర వ్యా ఖ్యలు చేశారు. సూపర్ సిక్స్ అంటూ మోసం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. నిరుద్యోగ యువతను మోసం చేశారని దుయ్యబట్టారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులకు ఇస్తామన్న రూ. 20 వేల పెట్టుబడి సాయం ఏమయిందని అమర్ నాథ్ ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటి నుంచి అమలు చేస్తారని అడిగారు. కూటమి ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇస్తామని చెప్పామని... ఇప్పటి నుంచి ప్రభుత్వంపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని తెలిపారు. తమ అధినేత జగన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ మోసాలను ఎండగడతామని అన్నారు. వైసీపీ, కూటమి ప్రభుత్వాల మధ్య ఉన్న తేడా ఏమిటనే విషయాన్ని ఈ ఆరు నెలల్లోనే ప్రజలు గుర్తించారని అమర్ నాథ్ చెప్పారు. ఇచ్చిన మాటను తమ ప్రభుత్వం నిలబెట్టుకుందని... కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మండి పడ్డారు. తన పాలనలో జగన్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అమర్ నాథ్ కొనియాడారు. ఆర్టీసీని ప్రభు త్వంలో విలీనం చేశారని చెప్పారు. వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని కితాబిచ్చారు. ఐదేళ్ల లో ప్రజల ఖాతాల్లో రూ. 2.75 లక్షల కోట్లు వేశారని చెప్పారు. త్వరలోనే జగన్ జిల్లాల పర్యటనను చేపడ తారని తెలిపారు. తాము చేపడుతున్న ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలకు ప్రజల నుంచి విశేషమైన స్పందన వ స్తోందని చెప్పారు. దేశంలోనే ధనిక సీఎంగా చంద్రబాబు పేరు సంపాదించారని అమర్ నాథ్ అన్నారు. రెండు ఎకరాల ఆసామి చంద్రబాబు వెయ్యి కోట్లు ఎలా సంపాదించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉంగరం, వాచ్ పెట్టుకోనంత మాత్రాన చంద్రబాబుకు ఆస్తులు లేవంటే ఎవరూ నమ్మరని అన్నారు. ప్రధాని మోదీ ఏపీ పర్యటనకు ముందే స్టీల్ ప్లాంట్ పై తమ వైఖరి ఏమిటో కూటమి ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

## కాఫీ తయారు చేసి లబ్ధిదారులకు ఇచ్చిన చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

లబ్ధిదారులతో సిఎం చంద్రబాబు ముఖాముఖి మాట్లాడారు. యల్లమందలో పింఛన్ లబ్ధిదారు ఏడుకొండలు ఇంటికి చంద్రబాబు వెళ్లారు. దీపం పథకం గురించి ఆరా తీయడంతో పాటు ఏడుకొండలు ఇంట్లో స్వయంగా కాఫీ తయారు చేసి కుటుంబ సభ్యులకు చంద్రబాబు అందించారు. ఏడుకొండలు కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకుని, అతను దుకాణం పెట్టుకునేందుకు బిసి కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల రుణం ఇప్పించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ఇంటి నిర్మాణం పూర్తి కోసం కూడా రుణం ఇప్పించాలని అధికారులకు సూచించారు. శారమ్మ ఇంటికి వెళ్లి పింఛన్ నగదు సిఎం చంద్రబాబు అందజేశారు. ఆమె కుటుంబం కష్టాలు అడిగి సిఎం తెలుసుకున్నారు శారమ్మ కుమారుడికి ఎస్సి కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష రుణం ఇప్పించాలని, శారమ్మ కుమార్తెకు నీట్ కోచింగ్ ఇప్పించాలని అధికారులను ఆదేశించారు.లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ డబ్బులు అందజేయాలని అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలకు చంద్రబాబు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. పెన్షన్ల పంపిణీలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా 5,402 మంది వితంతువులకు పెన్షన్ మంజూరు చేసింది. భర్త చనిపోతే వెంటనే భార్యకు పెన్షన్ ఇచ్చింది. గతంలో 6 నెలలకు ఒకసారి కొత్త పెన్షన్లు మంజూరు చేసేవారు. కానీ పెన్షన్ మంజూరు విధానంలో ప్రభుత్వం పెను మార్పులు తీసుకొచ్చింది. మూడు నెలలుగా వివిధ కారణాలతో పెన్షన్ తీసుకోని 50 వేల మందికి సైతం ఇవాళ పెన్షన్ పంపిణీ చేశారు. రెండు, మూడు నెలల పెన్షన్ మొత్తం ఒకేసారి అందజేశారు.

# కాంగ్రెస్ 3డీ రాజకీయాలు

మొదటి పేజి తరువాయి



కేసులు వే యించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్లు కోత విధించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎ న్నికల్లో బిఆర్ఎస్ సత్తా చూపిస్తామని పేర్కొన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. లోకల్ బాడీస్‌లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేవరకు వదిలేది లేదని కెటిఆర్ హెచ్చరించారు.

బిఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేస్తాం

2025 సంవత్సరంలో బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని కెటిఆర్ వెల్లడించారు. 2024లో బిఆర్ఎస్ పార్టీ కొంత గడ్డు కాలం ఎదుర్కొందని, ప్రతికూలతలను తట్టుకుని నిలబడ్డామని అన్నారు. ఈ ఏడాది చివరకు బిఆర్ఎస్ క్యాడర్‌లో విశ్వాసం, ఆత్మసైర్యం కన్పిస్తోందని అన్నారు. పార్టీ శిక్షణ కార్యకలాపాలు, సభ్యత్వ నమోదు కార్యకలాపాలు చేపడతామని, అదే సమయంలో పార్టీ అధ్యక్ష ఎన్నిక కూడా ఉంటుందని తెలిపారు. గ్రామంలోని బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా అన్ని విభాగాల్లో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఎన్నికల అంశంలో పార్టీలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని పేర్కొన్నారు.ఎప్పుడు బయటకు రావాలో తమ అధినేత కెసిఆర్‌కు తెలుసు అని చెప్పారు. కెసిఆర్ 24 ఏళ్లు కష్టపడ్డారని%ొ% కాస్త విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపారు.

కాంగ్రెస్ ధోకా నామ సంవత్సరంగా 2024

2024 సంవత్సరాన్ని కాంగ్రెస్ ధోకా నామ సంవత్సరంగా చెప్పుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. హామీల అమలులో రేవంత్ ప్రభుత్వం ఫెయిల్ అయిందని.. కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఎల్లో నిరాశ కన్పిస్తోందని చెప్పారు. హామీలపై పెట్టుకున్న డెడ్‌లైన్లు కాంగ్రెస్‌కు శాపంగా మారాయని విమర్శించారు. కాంగ్రెస్ క్యాడర్ కూడా ప్రశ్నిస్తోందని, ప్రజలు 6 గ్యారెంటీలు గురించి అడుగుతున్నారని క్యాడరే మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన అడ్డగోలు హామీలు, గ్యారంటీలు ఆ పార్టీకి శాపాలై చుట్టుకున్నాయని వ్యాఖ్యానించారు.

సినిమా వాళ్లతో సెటిల్మెంట్ చేసుకొని ఇప్పుడు మాట్లాడట్లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్, డైవర్షన్ (3 డీ) చేస్తోందని కెటిఆర్ విమర్శించారు. ప్రచారం కోసమే సినిమా వాళ్ల గురించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని కెటిఆర్ ఆరోపించారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రయత్నించారని ధ్వజమెత్తారు. అటెన్షన్, డైవర్షన్ కోసమే సిఎం పాకులాడారని వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్ వ్యవహారంపై కెటిఆర్ స్పందిస్తూ సినిమా వాళ్లతో సెటిల్‌మెంట్ చేసుకొని సిఎం ఇప్పుడు మాట్లాడట్లేదని ఆరోపించారు. గురుకులాల్లో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు, ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ప్రభుత్వ పెద్దలు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు, చేనేతల మరణాలపైనా సిఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఉద్ఘాటించారు. అందరికీ కనీసం రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేసులతో భయపెట్టాలని చూస్తోందని, వాటిని న్యాయపరంగా ఎదుర్కొంటామని అన్నారు.

అనుమానాలపైన కాదు.. ఆధారాలపైనే కేసులు ఉంటాయి

అనుమానాలపైన కేసులు ఉండవని, కేవలం ఆధారాలపైన మాత్రమే కేసులు ఉంటాయని కెటిఆర్ పేర్కొన్నారు. తన కేసుల్లో ఇడి దూకుడుగా ఉందన్న ప్రచారం జరుగుతోందని తెలిపారు. ఫార్ములా - ఈ కార్ రేసు కేసుపై ఆయన మరోసారి స్పందించారు. తనకు ఇడి నోటీసులు వచ్చిన మాట వాస్తవమని అన్నారు. తనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పసలేని కేసులు పెట్టరాని మండిపడ్డారు. ఎసిబి కేసులో బలం లేదని సిఎం రేవంత్ రెడ్డికి కూడా తెలుసు అని పేర్కొన్నారు. ఎసిబి ఎఫ్ఐఆర్ తప్పని హైకోర్టులో క్వాష్ వేశానని అన్నారు. తాను ఆశావాదిని అని, తనకు న్యాయస్థానాల్లో న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసులకు భయపడేది లేదని, కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటానని స్పష్టం చేశారు.ఈ కేసు విషయంలో తాను మాట మార్చినట్లు మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతుందని, ఈ కేసులో మొదటిరోజు చెప్పిన దానికి తాను కట్టుబడి ఉన్నానని తేల్చిచెప్పారు. ఫార్ములా ఈ రేసుకు మంత్రి హోదాలోనే తానే డబ్బులు చెల్లించినట్లు పేర్కొన్నారు. ప్రొసీజర్ ప్రకారం జరగకుంటే.. ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్, ఆర్‌బిఐ దగ్గరకు ఎందుకు పోలేదని ప్రశ్నించారు. కట్టిన ప్రతి పైసాకు లెక్క ఉందని స్పష్టం చేశారు. డబ్బులు ముట్టినవారిపై కేసులు ఎందుకు పెట్టలేదని నిలదీశారు. సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అనేకసార్లు వివిధ రకాల కేసులు పెట్టి తనను జైలుకు పంపాలని ప్రయత్నం చేసిందని అన్నారు. అనేక రకాల అంశాలు లేవనెత్తుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ మొత్తం వ్యవహారంలో తమకు డబ్బులు ఎట్లా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు.

రేవంత్‌రెడ్డికి రక్షణ కవచంలా బిజెపి ఎంపీలు

కాంగ్రెస్ ప్రభుత్వం తమకంటే ఎక్కువగా అప్పులు చేసిందని కెటిఆర్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా కట్టకుండా సంవత్సరంలో లక్ష 39 వేల కోట్ల అప్పు ఎందుకు చేసిందని అన్నారు. ఒక్క కార్యక్రమం చేపట్టకుండా ఈ అప్పులన్నీ ఢిల్లీకి పంపిస్తున్నారా..? అని ప్రశ్నించారు. అప్పుల కోసమే అప్పులు చేస్తున్నామని ఈ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందని విమర్శించారు. ఆర్ఆర్ఆర్ రోడ్డు గతంలో తమ ప్రభుత్వం ఉన్నప్పుడే వచ్చిందని, అప్పటి ప్రభుత్వమే క్యాబినెట్‌లో ఆమోదం కూడా తెలిపిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిందేమీ లేదన్నారు. ఓఆర్ఆర్ లీజు రద్దు చేసి సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికలతో పెద్దగా నష్టం లేదని, ఇబ్బంది ఉండదని తెలిపారు.అసెంబ్లీలో కూడా సిఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గంలో ఉన్న మంత్రులు రాష్ట్ర అప్పుల పైన ఒక్కొక్క అబద్ధాన్ని అసెంబ్లీలో మాట్లాడారని ఎద్దేవా చేశారు. 420 గ్యారంటీలు అమలు చేసే వరకు వదిలిపెట్టమని స్పష్టం చేశారు. మాజీ ప్రధాని పివి నరసింహారావుకు ఢిల్లీలో మెమోరియల్ ఏర్పాటు చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

## అగ్రగామిగా హైదరాబాద్..

## సహకరించండి: సీఎం రేవంత్

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలపై చర్చించారు. రీజినల్ రింగు రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్తగా మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించారు. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్య శిక్షణ వంటి అంశాలను వివరించారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులను పెంచడంపై రేవంత్ కృతజ్ఞతలు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధితో టాప్ ఫిఫ్టీకి: సత్య నాదెళ్ల

తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటామని సత్య నాదెళ్ల ప్రకటించారు. నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగిన రీతిలో మౌలిక సదుపాయాలు మెరుగు పరిచే అంశంలో ముఖ్యమంత్రి దార్శనికతను ఆయన ప్రశంసించారు. నైపుణ్యాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే ఆర్థికాభివృద్ధికి దోహద పడతాయని, హైదరాబాద్‌ను ప్రపంచంలోని 50 అగ్రశ్రేణి నగరాల జాబితాలో చేర్చుతాయని చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటైన తొలి సాంకేతిక సంస్థల్లో ఒకటైన మైక్రోసాఫ్ట్ ప్రస్తుతం ఇక్కడ పది వేల మందికి ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడి పెట్టామని గుర్తుచేశారు. సీఎస్ శాంతికుమారి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు.

ఆర్ అండ్ డీ సెంటర్ ఏర్పాటు చేయండి: శ్రీధర్‌బాబు

సీఎం భేటీ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం సత్య నాదెళ్లతో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. ఇటీవల కొత్తగా మరో 4వేల ఉద్యోగాల కల్పనకు మైక్రోసాఫ్ట్ ముందుకు రావడంపై మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. చందనవెల్లిలో రెండు, మేకగూడ, షాద్‌నగర్‌లో ఒక్కో సెంటర్ చొప్పున మొత్తంగా 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ల ఏర్పాటును స్వాగతించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న క్లౌడ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యూచర్ సిటీలో భాగంగా నిర్మించే ఏఐ సిటీలో 'ఏఐ సాంకేతికత'కు సంబంధించి ప్రత్యేక పరిశోధన, అభివృద్ధి కేంద్రం (ఆర్ అండ్ డీ), ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఏఐ, జెన్ ఏఐ కోర్సుల్లో మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇవ్వాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణాలో టీడీపీ

## విస్తరణ సాధ్యమేనా ?

మొదటి పేజి తరువాయి




అవేంటి అంటే తెలంగాణాలో ఈ రోజుకీ టీడీపీకి అభిమానులు ఉన్నారు. బాబు మంచి ముఖ్యమంత్రి అని మెచ్చుకునే జనాలు కూడా ఉన్నారని అంటున్నారు. అలాగే టీడీపీకి కొన్ని చోట్ల క్యాడర్ అయితే ఉంది. కానీ ఎక్కడ చూసినా నడిపించే నాయకత్వం అయితే లేదు అని అంటున్నారు. నియోజకవర్గాల స్థాయిలో బలమైన నేతలు అయితే మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలో లేరు అని అంటున్నారు. దాంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దిగాలని టీడీపీ భావిస్తోంది అంటున్నారు. 2025లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులను పెట్టడం ద్వారా టీడీపీకి పట్టు ఉన్న ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ వంటి జిల్లాలలో ఎన్నో కొన్ని సీట్లు గెలుచుకుంటే క్షేత్ర స్థాయిలో పటిష్టమైన నాయకత్వం ఏర్పాటు అవుతుందని ఆ మీదట 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ బలపడుతుందని టీడీపీ అధినాయకత్వం విశ్వసిస్తోంది. అయితే తెలంగాణాలో టీడీపీ పట్ల జనంలో అభిమానం ఉన్నప్పటికి అవి ఓట్లు కింద కన్వర్ట్ కావడం అంటే అంత సులువుగా జరిగే పని కాదని అంటున్నారు. తెలంగాణా ఏర్పాటు అయింతే స్థానికంగా పాలించుకోవాలన్న నినాదంతో అని గుర్తు చేస్తున్నారు. టీడీపీకి అధినాయక్త్వం ఆంధ్రా నుంచి ఉంది. అందువల్ల ఆ పార్టీ ఎదుగుదలకు అదే మూలమైన అవరోధంగా మారుతుంది అని అంటున్నారు. అయితే టీడీపీని జాతీయ పార్టీగా ప్రకటించుకున్నారు. పైగా బ్రహ్మాండమైన పార్టీ ఆఫీసు ఈ రోజుకీ హైదరాబాద్ నడిబొడ్డున ఉంది. దాంతో పాటు వంద అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయబోతున్నారు. ఎన్టీఆర్ సమాధి కూడా హైదరాబాద్ లోనే ఉంది. వీటిని అన్నింటికీ దృష్టిలో ఉంచుకుని టీడీపీ రాజకీయంగా ఎంతో కొంత అక్కడ ఉనికి కోసం ప్రయత్నం చేయాల్సిందే అని అంటున్నారు. కానీ తెలంగాణాలో అధికారం అయితే స్థానికంగా ఉన్న తెలంగాణా వాదులకు తప్ప ఏపీ మూలాలు ఉన్న నాయకత్వ పార్టీలకు ఎప్పటికీ దక్కదు అన్నది ఒక కఠినమైన విశ్లేషణ అని అంటున్నారు. అయితే పొత్తు రాజకీయాలలో సంకీర్ణ యుగంలో ఎంతో కొంత టీడీపీకి మేలు జరగకపోతుందా అన్నదే టీడీపీ పెద్దల ఆలోచనగా ఉంది అని అంటున్నారు. చూడాలి మరి టీడీపీది ఆశనా లేక అత్యాశనా లేక వృధా ప్రయాసనా అన్నది రానున్న కాలమే తేల్చి చెప్పనుంది.

## ఏపీ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు చెప్పిన

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఎందుకంటే?

మొదటి పేజి తరువాయి

తెలంగాణకు చెందిన ప్రజా ప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసుల లేఖలను అనుమతిస్తూ తీసుకున్న నిర్ణయం తీసుకున్నారు. వారానికి 4 లేఖలను అనుమతించాలని చెప్పినట్లు తెలిపారు. వారానికి 2 బ్రేక్ దర్శనాలు.. మరో రెండు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సంబంధించిన లేఖలు అనుమతించారు. ఈ నిర్ణయంపై తెలంగాణ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయంపై.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ సోషల్ మీడియా ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. ఈ మేరకు పోస్టుతో పాటు వాళ్లిద్దరు పరస్పరం రాసుకున్న లేఖలను కూడా రేవంత్ రెడ్డి షేర్ చేశారు. ఈ పోస్టుతో పాటు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి రాసిన లేఖను.. దానికి స్పందిస్తూ చంద్రబాబు రాసిన లేఖను రేవంత్ రెడ్డి పంచుకున్నారు. శ్రీవారి దర్శనంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించినందుకు తెలంగాణ మంత్రి కొండా సురేఖ సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఈ అంశంపై ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కృషి చేశామని, ఇది ఫలించిందన్నారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం ప్రజాప్రతినిధుల సిఫార్సును అంగీకరించడం కొత్త సంవత్సర కానుకగా మంత్రి కొండా సురేఖ అభివర్ణించారు. తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. మరోవైపు ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్వాగతించారు. ఏపీ ప్రజా ప్రతినిధులతో సమానంగా తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖలు అనుమతించాలని కోరారు. తిరుమలలో తానేం తప్పుగా మాట్లాడలేదన్నారు మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్. తెలంగాణ భక్తుల మనోభావాలను మాత్రమే వ్యక్త పరిచానని చెప్పారు.

## ఈ ఏడాదంతా దురదృష్టకరమే..

## రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పిన మణిపూర్ సీఎం

మొదటి పేజి తరువాయి

నేను భావిస్తున్నాను' అని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటి వరకూ జరిగిన తప్పులను క్షమించి.. మణిపూర్‌లోని 35 తెగలు కలిసి సామరస్యంగా జీవించాలని విజ్ఞప్తి చేశారు. ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో గత మే నెలలో చెలరేగిన ఘర్షణలు యావత్ దేశాన్ని కలవరపరిచాయి. మైతీలకు రిజర్వేషన్ల అంశంపై కుకీలు, మైతీల మధ్య చిచ్చు రేగింది. రెండు జాతుల మధ్య వైరం హింసాత్మకంగా మారింది. ఇద్దరు మహిళలను కొందరు వ్యక్తులు నగ్నంగా ఊరేగించిన ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. పార్లమెంట్‌ను కూడా ఈ అంశం కుదిపేసింది. ఈ హింసాత్మక ఘటనల్లో 200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 50 వేల మందికిపైగా నివాసాలను కోల్పోయారు.

## నాకు హైకమాండ్

## ఎవరూ లేరు: సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి



ఇంటింటికీ తిరిగి స్వయంగా పింఛన్ లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తలుచుకుంటే ఏదైనా సాధ్యం చేస్తారని అన్నారు. తనకు హైకమాండ్ అంటూ ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఐదు కోట్ల మంది ప్రజలే నాకు హైకమాండ్ అని పేర్కొన్నారు. తన జీవితంలో ఎన్నడూ చూడనంత విధ్వంసం గత ఐదేళ్లలో చూశానని వెల్లడించారు. అన్ని వ్యవస్థలను దోపిడీ చేసి నిర్వీర్యం చేశారని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్లించేశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో కంపెనీలన్నీ రాష్ట్రం నుంచి పారిపోయాయని, తాము అధికారంలోకి వచ్చాక మళ్లీ ఒక్కో కంపెనీ రాష్ట్రంలోకి అడుగుపెడుతున్నాయని వివరించారు. విధ్వంస పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని అన్నారు. సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుని వేధింపులకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఆడబిడ్డలపై సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడితే తాటతీస్తానని చంద్రబాబు హెచ్చరించారు. మంచివాళ్లకు మంచిగా ఉంటా... దారి తప్పితే ఊరుకునేది లేదని అన్నారు. ఇక, నదుల అనుసంధానంతో రాష్ట్రంలో నీటి కొరత లేకుండా చేస్తామని, జలహారతి పథకానికి శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. ఏపీని కరవు రహిత రాష్ట్రంగా తయారుచేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొన్నారు. డ్రోన్స్ ద్వారా వ్యవసాయానికి శ్రీకారం చుట్టబోతున్నామని చంద్రబాబు వెల్లడించారు. రాబోయే రోజుల్లో రైతులకు ఎటువంటి కష్టాలు రాకుండా అండగా నిలుస్తామని వివరించారు. తాము అధికారంలోకి రాగానే చెత్తపై పన్ను ఎత్తివేశామని తెలిపారు. గుంతలు లేని రహదారులు ఉన్న రాష్ట్రంగా మార్చే బాధ్యత తమది అని పేర్కొన్నారు. "మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే జీవో నెం.217ని రద్దు చేశాం. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. ఇప్పటిదాకా 198 అన్న క్యాంటీన్లు నెలకొల్పాం... అవసరమైతే ఇంకా ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



మడకశిర డిసెంబర్ 31 జనం రిపోర్టర్ : ఒకటో తేదీ ముందుగానే పింఛన్ లబ్ధిదారులకు అందజేత ఎమ్మెల్యే టిటిడి బోర్డు మెంబర్ ఎమ్మెస్ రాజు తెదేపా ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి చేతుల మీదుగానే మడకశిర పట్టణం కొత్త ఎస్సీ కాలనీ మరియు ఈఅచ్చంపల్లి తాండ డి.రామగిరి గ్రామాలలోవృద్ధులు, వితంతువులు, ఒంటరిమహిళలు, దివ్యాంగుల కు వారి గడపకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ను డిసెంబర్ 31వ తేదీన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి మాట్లాడుతూ నూతన సంవత్సరం నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులు అనాధికారులు ప్రజా ప్రతినిధులు నియోజకవర్గ ప్రజల అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ అందరూ సుఖ సంతోషాలతో బాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, కన్వీనర్లు, క్లస్టర్ ఇంఛార్జిలు, కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు టిడిపి బిజెపి జనసేనా నాయకులు పాల్గొన్నారు. వృద్ధాప్య వికలాంగుల వితంతుల కళ్ళల్లో ఆనందంగా ఉంది అన్నారు

# రక్తదానము ప్రాణదానమే



రేపల్లె డిసెంబర్ 31 జనం రిపోర్టర్ : కడప పెద్ద దర్గా 10వ పీఠాధిపతి గారైనటువంటి హజరత్ ఖాజా సయ్యద్ షా అమీనుల్లా మొహమ్మద్ మహమ్మదుల్ హుస్సేని చిస్టివుల్ ఖాద్రీ వారి జన్మదినం సందర్భంగా రేపల్లె పరిసర ప్రాంతాల లోని ఆయన శిష్య బృందం ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా ప్రాణదానంతో సమానమైన రక్తదానాన్ని స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు నందు చేయడం జరిగింది. నిరుపేదలను ఆదుకొనుట నిర్భాగ్యులకు ఆశ్రయము కల్పించుట సమాజంలో ఆధ్యాత్మికతతో కూడిన ప్రేమ తత్వాన్ని వ్యాప్తి చెందించుట గురువుగారి బోధనలలో ముఖ్యమైనవి అందుమూలకంగా సాటి మనిషి ప్రాణాలను నిలబెట్టి జీవితాన్ని కొనసాగింపజేసే అత్యుత్తమ దానం రక్తదానమని అందుమూలకంగా ప్రతి సంవత్సరం కూడా తాము గురువుగారి జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదానాన్ని చేస్తూ ఉంటామని వారు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తూ బాపట్ల జిల్లా బ్రాంచ్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ అయిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ కడప గురువుగారికి మరియు వారి శిష్య బృందానికి ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. డాక్టర్ వీర రాఘవయ్య మాట్లాడుతూ ఈ రక్తదానం ఎందరో ప్రాణాలను కాపాడేందుకు అనునిత్యం ఉపయోగపడుతుందని వీరిని ఆదర్శంగా తీసుకుని సమాజంలోని ప్రతి ఒక్కరు రక్తదానం కార్యక్రమాల్లో పాల్గొనాలని తద్వారా అవసరంలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు. ఈ ప్రత్యేక రక్తదాన శిబిరంలో దాదాపు 30 మంది కడప గురువుగారి శిష్య బృందం రక్తదానాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు అడుసు మల్లి ప్రభాకర్ రావు మరియు సయ్యద్ కరీముల్లాలు పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రేపల్లె మున్సిపాలిటీ 26వ వార్డు కౌన్సిలర్ డొక్కు బుజ్జి మరియు గురువుగారి శిష్య బృందం పాల్గొన్నారు...

## దేశాయి ప్రకాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మక్తల్ ఎమ్మెల్యే



అమరచింత వనపర్తి డిసెంబర్ 31 జనం రిపోర్టర్: హైకోర్టు సీనియర్ న్యాయవాది మాజీ అడ్వకేట్ జనరల్ అమరచింత వాసి సామాజిక వేత్త, విధ్యా ప్రదాత, దేశాయి ప్రకాష్ రెడ్డిని మంగళవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కల్లుగీత డిపార్ట్మెంట్ చైర్మన్ కేశం, నాగరాజు గౌడ్ హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డికి పుష్పగుచ్చం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అమరచింతలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. విద్య, వైద్యం సామాన్యులకు అందజేసి ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు మనస్ఫూర్తిగా ప్రకాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్ ఉన్నారు.

## రాజకీయాలకతీతంగా దేశాయ్ ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు



అమరచింత వనపర్తి డిసెంబర్ 31 జనం రిపోర్టర్: అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన సోదరి సౌజన్య రెడ్డి ఇంటి వద్ద వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు రాజకీయ పార్టీల నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాష్ రెడ్డి సోదరి సౌజన్య రెడ్డి రాజకీయ పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి ప్రకాష్ రెడ్డి అభిమానులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ మంగమ్మ రాజేందర్ సింగ్ నాగభూ షణం గౌడ్ మహంకాళి విష్ణు మేర్వ రాజు తాటికొండ రమేష్ ఎస్ ఎ రాజు క్యామ భాస్కర్ దేశాయి ప్రకాష్ రెడ్డి సేవాసమితి అధ్యక్షులు సయ్యద్ కలాం పాషా తో పాటు పలువురు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# రాజవొమ్మంగిలో టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



రాజవొమ్మంగి,డిసెంబర్ 31 జనం రిపోర్టర్: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల కేంద్రంలో మంగళవారం తెదేపా మండల ప్రధాన కార్యదర్శి ముప్పన కేశవ్ అధ్యక్షతన టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు సభ్యత్వ నమోదు చివరి రోజు కావడంతో చురుగ్గా పలువురు సభ్యత్వాలు చేయించుకున్నారు ఈకార్యక్రమంలో కేశవ్ మాట్లాడుతూ మండలంలో సుమారు ఐదువేల మందికి పైగా సభ్యత్వ నమోదు చేసినట్లు తెలిపారు నియోజకవర్గంలోనే తెదేపా సభ్యత్వ నమోదులో రాజవొమ్మంగి మొదటి స్థానంలో నిలిచిందని తెలియజేశారు సభ్యత్వ నమోదు ద్వారా కలిగే బెనిఫిట్స్ ని కార్యకర్తలకు వివరించారు ఈ కార్యక్రమంలో చెక్కా సుబ్రహ్మణ్యం,వరదా సత్తిబాబు,శ్రీకాకుళపు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ సత్వర న్యాయం జరుగుతుందని భరోసా కలిగించాలి

**చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారి పట్ల కఠినముగా వ్యవహరించాలి....**

**రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్....**





**రామగుండం /డిసెంబర్ 31(జనం రిపోర్టర్):** ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల పోలీసులు కఠినముగా వ్యవహరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం మందమర్రి సీఐ ఆఫీస్, పోలీస్ స్టేషన్ ను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ మంచిర్యాల డీసీపీ తో కలిసి తనిఖీ చేశారు. మందమర్రి పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కి పోలీస్ అధికారులు మొక్కలను అందజేసి, స్వాగతం పలకగా సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు, ప్రతి దరఖాస్తు పై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్మెంట్ లో అప్లోడ్ చేసి రిసిప్ట్ ఇవ్వాలని, వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లోని లాక్ అప్ రూమ్, రైటర్ రూమ్, రికార్డ్స్ రూమ్ పరిశీలించారు. అనంతరం సర్కిల్, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీంచారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. శాంతి భద్రత నియంత్రణ కై పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, ప్రజల భద్రత మనందరి బాధ్యతని, ప్రధానంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లపై, ట్రబుల్ మాంగర్స్ పై ప్రత్యేక నిఘా పెట్టాలని, ముఖ్యంగా పోలీస్ స్టేషన్ కు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, ప్రజలు సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చినప్పుడు వెంటనే స్పందిస్తూ, బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలి అని సూచించారు. ప్రజలు పోలీస్ స్టేషన్ కు వచ్చి ఏలాంటి సమస్య, సందేహాలు, సలహాలు, సూచనలు అడిగే లాగా ప్రజలకు వున్న నమ్మకానికి తగ్గాటుగానే పోలీసులు విధులు నిర్వర్తించాలి అన్నారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, మందమర్రి సీఐ శశి ధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ తోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





# గ్రంథాలయం ఎర్పాటు చేయాలి

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్



అమరచింత వనపర్తి డిసెంబర్ 31 జనం రిపోర్టర్: అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలో ఉన్న గ్రంథాలయం నిర్వహణకు నోచుకోక అస్తవ్యస్తంగా తయారయిందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం డి కుతుబ్ ఆరోపించారు. చిన్న గదిలో గ్రంథాలయాన్ని నిర్వహించి గత కొన్నెళ్లు గా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో మూతపడిందన్నారు. గ్రంథాలయానికి ప్రతి నెల అందాల్సిన మాస,వార, దిన పత్రికలు కొందరు చందాదారులు వేసుకొని నిర్వహించాలని. కొన్ని రోజుల అనంతరం అధికారులు పట్టించుకోకపోవడం వల్ల అధికాస్త మూతపడిందన్నారు. గ్రంథాలయంలో పుస్తకాలు బీరువాలు మాయమయ్యాయని ఆరోపించారు. అమరచింత మండల కేంద్రంలో మేధావులు విద్యార్థులు రకరకాల రంగాలకు సంబంధించిన వ్యక్తులు ఉన్నటువంటి వాళ్ళు గల్లి నుంచి ఢిల్లీ వరకు అన్ని స్థాయిలో పనిచేస్తున్న నాయకులు ఉన్నటువంటి అమరచింతకు గ్రంథాలయం లేకపోవడం సిగ్గుచేటనీ అన్నారు. ఎంతోమంది ఉన్నత స్థానానికి చేరువ కావడానికి గ్రంథాలయమే మొదటి మెట్టు కాబట్టి దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రవి, మైబు పాల్గొన్నారు.

## కడప అమీన్ పీర్ జన్మదినం సందర్భంగా అన్నసంతర్పణ..



పొన్నూరు డిసెంబర్ 31. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలో మంగళవారం కడప అమీన్ పీర్ దర్గా 10 వ పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా అమినుల్లా ఛిస్టివల్ ఖాదరి జన్మదిన0 సందర్భంగా పొన్నూరు పట్టణం ఐదో వార్డులో అన్నా క్యాంటీన్ నందు మూడు పూటలకు 1250 మందికి అన్నదాన కార్యక్రమాన్ని పొన్నూరు ఇదార ఏ అమినియా చిస్టియ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమం లో టెంట్ హౌస్ మునీర్, హబ్బు, నిజాముద్దీన్ జిలాని, మీరా వలి, గౌస్ పీర్, తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలు అందరికీ సమానం



కోట్ పల్లి డిసెంబర్ 31(జనం రిపోర్టర్): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోట్ పల్లి ఎస్సై అబ్దుల్ గఫర్ అన్నారు. మంగళవారం కోట్ పల్లి మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గఫర్ మాట్లాడుతూ..... సమాజంలో ప్రతి ఒక్కరు అన్న తమ్ముల్లాగా ఉండాలన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. అలాగే హక్కులకు భంగం కలగించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కుల, మత, వర్ణ బేధం, వివక్ష, అంటరానితనం రూపుమాపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ భాగ్యలక్ష్మి. ప్రొఫెషనల్ ఎస్సైలు వేణు. తిరుమలేష్ యాదవ్. గ్రామస్తులు తదితరులున్నారు.

# క్రిస్టమస్ నూతన సంవత్సర వేడుక

ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా ఇంటి వద్ద భారీ ఏర్పాట్లు



ఏలేశ్వరం, డిసెంబర్ 31, జనం రిపోర్టర్: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం నూతన సంవత్సర వేడుకలను వైభవంగా నిర్వహించాలని ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరపుల సత్య ప్రభరాజా ఇంటి వద్ద ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నవి. ఈరోజు ఎమ్మెల్యే, సత్య ప్రభ రాజా నూతన సంవత్సర ఏర్పాట్లను ఎన్డీఏ శ్రేణులతో కలిసి పరిశీలించారు. సభా వేదిక, సభా ప్రాంగణం, భోజనం వడ్డించే స్టాల్స్, వాహనాల పార్కింగ్ మరి ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే ప్రతి ఒక్కరికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆమె పార్టీ కేడర్ కు ఆదేశించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలకు వరుపులు రాజా అభిమానులకు ఎన్డీఏ కూటమి నేతలకు ఈ సందర్భంగా ఆమె క్రిస్టమస్ నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పర్వత సురేష్ ఇతర నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. నేడు జరగనున్న నూతన సంవత్సర వేడుకలకు



ప్రత్తిపాడులోఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాము అని సురేష్ అన్నారు.. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారు , పూలదండలు బొకేలకు బదులు పెన్ను పుస్తకాలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, పర్వత సురేష్,నగర పంచాయతీ నాయకులు బొదిరెడ్డి గోపి,కొమ్ముల కన్నబాబు,గొంతిన సురేష్,యాల జగదీష్, పలివెల శ్రీను, పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆకుల విజయకుమార్



నార్పల / డిసెంబర్ 31(జనం రిపోర్టర్): మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన ఆకుల విజయకుమార్ అలియాస్ బాబు. ఈ నూతన సంవత్సరం ప్రజలందరికి ఆయురారోగ్యాలతో పాటు సుఖ సంతోషాలతో ఉండాలని అలాగే రైతన్నలందరికీ పంటలలో దిగుబడి పెరిగి ఆదాయం రావాలని కోరుతూ మండల ప్రజలందరికీ మరొక మారు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు

# విజయవంతమైన ఉచిత గుండె వైద్య శిబిరం

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్



అమరచింత వనపర్తి డిసెంబర్ 31 జనం రిపోర్టర్: అమరచింత పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం హైకోర్టు సీనియర్ న్యాయవాది దేశ ప్రకాశ్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పాలమూరు శామ్యూల్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో ప్రముఖ కార్డియాల జిస్ట్ డాక్టర్ ప్రణయ్ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి గుండెపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. మారుతున్న జీవన ప్రమాణాలు ఆహారపు అలవాట్లు గుండెపోటుకు కారణం అవుతున్నాయని అన్నారు. గుండెపోటుకు గురైనప్పుడు ఎలాంటి ఆందోళన చెందకుండా ఉండాలన్నారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి అప్పటికప్పుడే సి పి ఆర్ చేస్తే బతికే అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. సి పి ఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరు సి పి ఆర్ నేర్చుకోవాలని అన్నారు. ప్రజల ముందే మైనపు బొమ్మతో సి పి ఆర్ ఎలా చేయాలో చూపించారు. ఈ శిబిరంలో దాదాపు 170 మంది గుండెకు సంబంధించిన చికిత్సలు చేయించుకున్నారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ఈసీజీ పరీక్షలు చేశారు. ఇందులో ఐదు మందికి గుండెకి సంబంధించిన ఇబ్బందులు ఉండడంతో మహబూబ్నగర్ కు రావాలని సూచించారు. డాక్టర్ ప్రణయ్, ఫిరోజ్, అనిత రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ జిఎస్ గోపి నాగభూషణం గౌడ్ సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్ రెడ్డి ఏపీ రాజేందర్ ఏకే వెంకటేశ్వర్ రెడ్డి ఎస్సే రాజు కేజీ మహేందర్ రెడ్డి క్యామ భాస్కర్ కురువ రాజన్న సూపర్వైజర్ కార్తీక్ గౌడ్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.



## పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుంది....

పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్.....



**రామగుండం /డిసెంబర్ 31(జనం రిపోర్టర్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి లో హెడ్ కానిస్టేబుళ్లు గా పనిచేస్తూ ఎఎస్ఐ గా పదోన్నతి పొందిన 03 మంది అధికారులకు, రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ వారిని అభినందించి వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నంను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ఇప్పటివరకు ఎలాంటి క్రమశిక్షణతో విదులు నిర్వహించారో అదేవిధంగా మిగతా సర్వీస్ పూర్తి చేసి, మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటాం, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని ఈ సందర్భంగా సీపీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, ఏ ఆర్ ఏ సి పి ప్రతాప్, సుందర్ రావు, ఎ ఓ శ్రీనివాస్ , ఆర్ఐ లు దామోదర్, మల్లేశం, వామన మూర్తి, శ్రీనివాస్, సంపత్, లు సూపరిండెంట్స్ ఇంద్రసేనారెడ్డి, మనోజ్ కుమార్, సంధ్య , రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బొర్లాకుంట పోచలింగం, స్వామి లు పాల్గొన్నారు.





## ఉద్యోగ విరమణ పొందుతున్న హెూంగార్డ్ లకి, సీపీ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు....



రామగుండం /డిసెంబర్ 31(జనం రిపోర్టర్): పోలీస్ శాఖలో గత 43 సం,, లుగా హెూం గార్డ్ గా జె. ఓదెలు హెూం గార్డ్ నంబర్ .288, 20 సంవత్సరాలు గా, టి.సత్తమ్మ మహిళా హెూం గార్డ్ -795, 28 సంవత్సరాలుగా, పి. లక్ష్మి మహిళ హెూం గార్డ్ -146, విధులు నిర్వహించడం జరిగింది. ఇట్టి హెూంగార్డ్ లు మంగళ వారం ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా, రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ కమీషనర్ కార్యాలయంలో వారిని పూలమాల వేసి, శాలువా తో సత్కరించి జ్ఞాపిక ను అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సుందర్ రావు, ఏ. ఓ శ్రీనివాస్, ఆర్ఐ దామోదర్, శ్రీనివాస్, వామన మూర్తి మల్లేశం, సంపత్ లు పాల్గొన్నారు.

## పొన్నూరు ఎస్సై సీఐలను అరెస్టు చేయాలని న్యాయవాదులు ఆందోళన




పొన్నూరు డిసెంబర్ 31. జనం రిపోర్టర్: పొన్నూరు పట్టణానికి చెందిన న్యాయవాది బేతాళం ప్రకాశరావును గత 26వ తేదీన పొన్నూరు పోలీసులు ఎస్ఐ, సిఐ అకారణంగా దూషించి, లాఠీ చార్జి చేశారని అందుకు నిరసనగా మంగళవారం గుంటూరు ఎస్పీ కార్యాలయం ఎదుట న్యాయవాదులు భారీ ఆందోళన చేపట్టారు. ఎస్ఐ, సిఐలను వెంటనే అరెస్టు చేసి న్యాయవాది వేతాళం ప్రకాశరావుకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎస్పీకి వినతి పత్రాన్ని అందించారు.

## భారత అస్థిత్వానికి ప్రతినిధి మన్మోహన్: కాంగ్రెస్ పార్టీ



పొన్నూరు డిసెంబర్ 31. జనం రిపోర్టర్: భారత దేశ సుస్థిరాభివృద్ధికి బాటలు వేసి, అనేక ఉదారవాద ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన ఆర్థిక నిపుణులు డా" మన్మోహన్ సింగ్, దేశ అస్థిత్వానికి ప్రతీక అని పొన్నూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా ఆయన సంస్కరణ సభను పొన్నూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ "మన్మోహన్ సింగ్ మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, వారి మరణం దేశానికే గాక ప్రపంచ ఆర్థిక ప్రగతికి తీరని లోటు అని, దేశంలో అనేక సంస్కరణలకు మన్మోహన్ ఆధ్యులని, పివి హయాంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, రెండు పర్యాయాలు దేశ ప్రధానిగా, మన దేశానికి మన్మోహన్ సింగ్ అందించిన సేవలు నిరుపమానమైనవని కొనియాడారు. మన దేశం అత్యధిక వృద్ధి రేటు సాధించి, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి సూపర్ పవర్ గా గుర్తించబడిందని, ప్రపంచాన్ని కుదిపేసిన ఆర్థిక మాంద్యం ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడకుండా గాడిలో పెట్టిన ఘనత మన్మోహన్ సింగ్ దని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంలో మన్మోహన్ సింగ్ తెచ్చిన సంస్కరణలు కీలకం అని, ఉపాధి హామీ, ఆహార భద్రత, విద్యా హక్కు, సమాచార హక్కు చట్టాలు భారతీయుల జీవితాలను మార్చేశాయన్నారు.ఈ కార్యక్రమంలో పొన్నూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అందే దిలీప్, రురల్ పార్టీ ఉపాధ్యక్షులు పొత్తూరి గిరిధర్, బొందలపాటి శ్రీనివాస్, నాగేశ్వరరావు, ముసలయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు రేవంత్, ఫణి తదితరులు పాల్గొని మన్మోహన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే టీడీపీ లక్ష్యంతో ప్రారంభించిన డ్వాక్రా సంఘాలకు పూర్వవైభవం తీసుకొస్తాం

### ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



ఎన్టీఆర్ జిల్లా, నందిగామ, /డిసెంబర్ 31(జనం రిపోర్టర్): ప్రతి సభ్యురాలికీ ప్రభుత్వ పథకాలు అందాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో మెప్మా సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పేద మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. డ్వాక్రా సంఘాల ఏర్పాటు.. మహిళా కమిషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మహిళలను శక్తివంతులుగా చేయడాని.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టారని ఈ సందర్భంగా గుర్తు చేసారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తున్నామని వివరించారు. క్రమబద్ధమైన సమావేశాలు, పొదుపు అంతర్గత అప్పులు, క్రమబద్ధమైన చెల్లింపులు, పుస్తక నిర్వహణతోపాటు సంఘాల బలోపేతంతో ఆర్థిక స్వావలంబనకు అవకాశం ఉంటుందన్నారు. మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడానికి మెప్మా బజార్లు ఎంతో దోహదం చేస్తాయన్నారు. స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు బ్యాంకుల ద్వారా అతి తక్కువ వడ్డీకి రుణాలను అందించడమే కాకుండా, రుణాలను పొందిన మహిళలు చిన్న చిన్న కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసి, వాటిని మెప్మా అర్బన్ బజార్ ల ద్వారా అతి తక్కువ ధరలకే విక్రయించి, లాభాలను సాధించడం ద్వారా మహిళలు ఆర్థిక అక్షరాస్యతను సాధించవచ్చునన్నారు. దీనికి సహకరించే విధంగా అధికారులు కూడా వారి పాత్ర పోషించాలని సూచించారు. గతంలో చంద్రబాబు నాయుడు అమెజాన్, ఫ్లిప్ కార్ట్ లో మీ ఉత్పత్తులను విక్రయింపజేసిన విషయాలను ఈ సందర్భంగా గుర్తు చేసారు.

## గజిబిజిగా పొన్నూరు ట్రాఫిక్.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు..



పొన్నూరు డిసెంబర్ 31. జనం రిపోర్టర్: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పొన్నూరు ట్రాఫిక్ ను పాలనాధికారులు నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారు. మంగళవారం పొన్నూరు పట్టణంలోని ప్రధాన కూడలి అంబేద్కర్, జిబిసి రోడ్డు గాంధీ, బొమ్మ సెంటర్, కసుకర్రు రోడ్డు, ఎమ్మార్వో కార్యాలయం సెంటర్లో నడివీధిలో ద్విచక్ర వాహనాలు, నెట్టుడు బళ్ళు, వాహనాలు వివిధ వ్యాపార సంస్థల ప్రత్యేక స్టాల్స్ ట్రాఫిక్ ను బంధించాయి. ప్రజలు ఎటు వెళ్లాలో అని అయోమయంలో తీవ్ర అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ ను నియంత్రించాల్సిన పోలీసు పట్టణం లో కనుచూపులో లేకపోవటం వలన వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ రోడ్లపైనే సంచరిస్తూ తమ పని తాము చేసుకుంటున్నారు. సాయంత్రం వేళ కావటంతో ఉద్యోగస్తులు , ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొన్నూరు పట్టణంలో పోలీసులు ఉన్నారా!.. లేరా!.. అని బహిరంగంగా తీవ్ర విమర్శలు గుప్పించారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ట్రాఫిక్ వలయాన్ని క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

## పేదల కళ్లలో ఆనందం చూడాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం



జనం రిపోర్టర్,ఎన్టీఆర్ జిల్లా, నందిగామ, డిసెంబర్ 31 :ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో మరో హామీని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని, తెలుగు ప్రజల నూతన సంవత్సరం ఉగాది నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించే దిశగా చంద్రన్న సర్కార్ అడుగులు వేస్తోందని ఏపీ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మంగళవారం నందిగామ పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నందిగామ పట్టణం ఏడవ వార్డులో కూటమి నేతలు అధికారులతో కలసి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు స్వయంగా అందజేశారు. ఈ క్రమంలో మాట్లాడుతూ, ఎన్టీఆర్ భరోసా కింద అందించే సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీలో ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సరళీకృతం చేసిందని తెలిపారు. 'ఆరేడు నెలకు ఒకసారి కొత్తగా పెన్షన్లు మంజూరు చేసే ధోరణికి స్వస్తి పలికాం అన్నారు. ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే వెంటనే భార్యకు పింఛను ఇచ్చే విధానాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. దీనిని స్పౌజ్ కేటగిరీగా గుర్తిస్తూ పెన్షన్ మంజూరు చేస్తున్నాం అని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నవంబరు 1న శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఈ నెల నుంచి పంపిణీ చేస్తున్నాం అని గుర్తు చేశారు. అందులో భాగంగా 5,402 మందికి కొత్తగా ఫించన్లు ఇస్తున్నాం అని, వారికి డిసెంబరు 31 ఈ రోజున రూ.4 వేల చొప్పున పింఛను పంపిణీ చేయనున్నామన్నారు. 'మహిళలకు ఇచ్చిన హామీల్లో ఉచిత గ్యాస్ సిలెండర్ పథకాన్ని ఇప్పటికే అమలు చేశామని, ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలు చేయాలని సంక్రాంతి నుంచి మొదలు పెడతాం' అని సౌమ్య అన్నారు.

## ధనుర్మాసం సందర్భంగా 17వ పాశురం

రేపల్లె డిసెంబర్ 25 జనం రిపోర్టర్: ధనుర్ మాసాని పురస్కరించుకొని స్థానిక ఉప్పుడి రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు తెలియజేశారు ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చిన భక్తుల కోసం అర్చకులు శ్లోకం చెప్పుతూ



అమ్బరమే తణ్ణీరే! శోఱే! అఱమ్ శెయ్యుమ్
ఎమ్బెరుమాన్! నన్దగోపాలా! ఎళిందిరాయ్
కొంబనార్కెల్లామ్ కొళున్దే! కులవిళక్కే
ఎమ్బెరు మాట్టి యశోదాయ్! అఱివుఱాయ్
అమ్బర మూడఱుత్తు ఓంగి యులగళన్ద
ఉమ్బర్ కోమానే ఉఱంజ్గాదు ఎళిందరాయ్
శెమ్ పొఱ్కళలడిచ్చెల్వాబీ బలదేవా
ఉమ్బియమ్ నీయుమ్ ఉఱంగేలో రెమ్బావాయ్

అర్చకులు శ్లోకం యొక్క భావాన్ని తెలియజేస్తూ

భావం : ద్వారాపాలకులు గోపాంగనలను లోనికి అనుమతించగా వారు మొదట అన్న, వస్త్ర, తీర్థాదులను ధర్మబుద్ధితో దానము చేసే నందగోపులను 'స్వామి! మేలుకొను' మని ప్రార్థించారు. తరువాత 'ప్రబ్బలి తీగవంటి స్త్రీల కందరకును, తీగవలె ముఖ్యమైనదానా! గొల్లకులమునకు మంగళదీపము వంటిదానా! మాకును స్వామినివైన ఓ యశోదమ్మా! లేమ్మా!' అని వేడుకొనిరి. 'ఆకాశమంత ఎత్తుకెదిగి సమస్త లోకాలను కొలిచి దేవతలకే రాజైన ఓ కృష్ణా! ఇక నిద్ర చాలునయ్యా! మేలుకో!' అని ప్రార్థించిరి. ఆయన వేళకుండుట చూచి, బలరాముని లేపక తప్పు చేసితిమని ఎరిగి 'మేలిమి బంగరు కడియములతో శోభించు పాదయుగళిని గల ఓ బాలరామా! నీ తమ్ముడు శ్రీకృష్ణుడును, నీవును యింకను నిదురించుట తగదు. కావున శీఘ్రమే లేచి రండు!' అని అందరినీ క్రమము తప్పక మేల్కొలుపుచున్నారు. వారి కృపను వేడుచున్నారు.

అవతారిక:-

ద్వారపాలకుని వేడి, అతడు గడియ తీసి గోపికలను లోనికి పంపగా అచట యింకను నిద్రిస్తున్న శ్రీనందగోపులను, శ్రీ యశోదమ్మను, శ్రీ బలరామునీ శ్రీకృష్ణునీ చూచారు - వారినందరను ఒక్కొక్కరిగా మేలుకొముపుటయే యీ (పాశురంలో) వర్ణించబడింది. తమకు అన్న వస్త్రాదులను దానం చేసే నందగోపుని మేల్కొల్పి తమకు అన్నధారక వస్త్రాదులన్నీ శ్రీకృష్ణుడే కావున వానిని అనుగ్రహించమని ప్రార్థిస్తున్నారు. ఇట నందగోపుడే సదాచార్యుడు. వానినాశ్రయించగా ఆచార్యుడు మంత్రోపదేశం చేస్తాడు. ఆ మంత్రమే యశోద. కనుక యశోదమ్మను మేల్కొలిపి - అనగా మంత్రాన్ననుష్ఠించి స్వామి దర్శనాన్ని అభిలషించి శ్రీకృష్ణుని లేపారు. కాని జరిగిన పొరపాటున గ్రహించి ప్రక్కనున్న పెద్దవాడైన బలరాముని మేల్కొలిపారు. బలరాముడు ఆదిశేషుని అవతారమేకదా! వారిని ప్రార్థిస్తున్నారీ పాశురంలో.

## వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో మా శారద హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం..!!




వికారాబాద్ జిల్లా ప్రతినిధిడిసెంబర్ 31 (జనం రిపోర్టర్): పూడూరు మండలంలో మా శారద హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి వైద్య శిబిరంలో 150 మందికి పైగా బిపి, షుగర్,మోకాళ్ళ నొప్పులు, జ్వరం దగ్గు,వాంథింగ్,మోషన్స్, కడుపునొప్పి మరియు ఇతర సమస్యలకి ఉచితంగా చూడడం జరిగింది మరియు సెలైన్లు మందులు ఉచితంగా ఇవ్వడం జరిగింది . ఈ వైద్య శిబిరంలో 30 మందికి పైగా రక్తపరీక్షలు కూడా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మా శారద హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రక్త పరీక్షలు చేయడం వల్ల ఈ గ్రామంలో బీపీ షుగర్ ఉన్నవాళ్లు ఎక్కువగా ఉన్నారని చెప్పారు. షుగర్ ఉన్న పేషెంట్స్ కి దానికి సంబంధించిన ఎలాంటి ఆహారం తీసుకుంటే షుగర్ కంట్రోల్ అవుతుందో దానిపైన అవగాహన కల్పించారు. బీపీ షుగర్ ని రోజు వ్యాయామం చేయడం వల్ల కూడా కంట్రోల్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మా శారద హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి, ఆర్కే ఫౌండేషన్ ప్రెసిడెంట్ %ః% బిజెపి మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ , మల్లేశం పటేల్ బిజెపి రాష్ట్ర నాయకులు, పూడూర్ గ్రామపంచాయతీ సెక్రటరీ మురళీ తదితరులు.

## ప్రజల సహకారం మరువలేనిది: ఎమ్మెల్యే ధూళిపాళ్ల



పొన్నూరు డిసెంబర్ 31. జనం రిపోర్టర్: ప్రజల సహకారంతో ప్రభుత్వం ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం పొన్నూరు తెదేపా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.రైతులకు 48 గంటలలో అకౌంట్లో డబ్బులు వేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానేదని పేర్కొన్నారు.అపరిష్కృతంగా ఉన్నరోడ్ల మరమ్మత్తులు వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. నూతన సంవత్సరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని అన్నారు. గత వైకాపాలనలో సుమారు ఐదు కోట్ల రూపాయలు పొన్నూరు నియోజకవర్గంలో జరిగిందని విచారించి బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. 2025 నూతన సంవత్సరం నియోజకవర్గంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## అధైర్య పడవద్దు అండగా ఉంటా

### సోషల్ మీడియాలో అసభ్య పదజాలం వాడవద్దు

### సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో దద్దాల నాయకులు యాదవ్



(కనిగిరి డిసెంబర్ 31 జనంరిపోర్టర్ ): మంగళవారం కనిగిరి స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైస్సార్సీపీ సోషల్ మీడియా సభ్యులతో ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గారు ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గారు మాట్లాడుతూ ప్రస్తుతం రాజకీయంలో సోషల్ మీడియా పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు.కావున సోషల్ మీడియా సోల్జర్స్ ఎప్పటికప్పుడు మనము చేసే పార్టీ కార్యక్రమాలు, మరియు జగనన్న పిలుపునిచ్చే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వాటిని సోషల్ మీడియా మాధ్యమంలో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పటికీ అప్పుడూ సరైన పద్దతిలో ప్రశ్నించాలన్నారు.ఎవరూ కూడా తప్పుడు ప్రచారం కానీ లేదా ప్రజా ప్రతినిధులను మరియు మహిళను కించపరిచే విధంగా అసభ్యకరమైన పదజాలం వాడరాద,మార్ఫింగ్ ఫోటోలుఅప్లోడ్ చేయవద్దని ఆయనకార్యకర్తలను కోరారు.అనంతరం సోషల్ మీడియా సభ్యుల నుండి వారి సమస్యలను అడిగి తెలుసుకొని మీకు ఎల్లప్పుడూ అందుబాటు ఉంటాను అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసుల రెడ్డి, సీనియర్ నాయకులు గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, ప్రచార కమిటీ అధ్యక్షులు దాదిరెడ్డి మాలకొండారెడ్డి,మాజీ సర్పంచ్ గోబ్బిళ్ల శ్రీను మరియు టౌన్ మరియు 6 మండలాల సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు

## ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం: మాదారి భోజరాజు

### కమిషన్ ముందు తమ అభిప్రాయాలు చెప్పిన జాతీయ బాలల ఐక్యవేదిక నాయకులు



అమరచింత వనపర్తి డిసెంబర్ 31 జనం రిపోర్టర్: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని వనపర్తి జిల్లా జాతీయ మాలల ఐక్యవేదిక అధ్యక్షులు మాదారి భోజరాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఎస్సి ఉప వర్గీకరణ కమిషన్ శమీమ్ అక్తర్ ముందు మాదారి భోజరాజు తమ అభిప్రాయాలను కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని కమిషన్ ముందు స్పష్టం చేశారు. ఆర్టికల్ 341కు ఇది వ్యతిరేకమని రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన రిజర్వేషన్ సుప్రీంకోర్టు సూచనలతో చేయడం కరెక్ట్ కాదన్నారు. అసలు రిజర్వేషన్ కుట్రని ఎత్తేసే ప్రక్రియ జరుగుతుందని ఇది మాదిగలు గుర్తించాలన్నారు. మామాదిగలకు మాలలు ఎప్పటికీ వ్యతిరేకం కాదని ఇది రాజ్యాంగబద్ధంగా జరగాల్సిన ప్రక్రియ అని అన్నారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్ 15 నుండి 20 శాతానికి పెంచాలని కమిషన్ కి తెలిపారు. వర్గీకరణ ఎందుకు జరగకూడదు స్పష్టంగా పలు వివరణతో కమిషన్ కు మాలల ఐక్యవేదిక నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

## పేదలకు అండగా చంద్రన్న ప్రభుత్వం



నార్పల/డిసెంబర్ 31(జనం రిపోర్టర్): పేదలకు అండగా చంద్రన్న ప్రభుత్వం నిలుస్తుందని జిల్లా విజిలెన్స్ %ఁ% మోనెటరింగ్ కమిటీ మెంబర్, ఓ.వి.పేట నీటిసంఘం అధ్యక్షులు, కళింగ గ్లోబల్ ఫెడరేషన్ అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు పేర్కొన్నారు. మంగళవారం బుర్జ మండలం ఓ.వి.పేట గ్రామంలో పేదలకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వితంతువులకు, వృద్ధులకు, కళాకారులకు, వికలాంగులకు ప్రతినెలా సకాలంలో సామాజిక పింఛన్లు అందించి మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వారికి చేదోడుగా నిలుస్తున్నారన్నారు. స్థానిక వైస్.ఎంపిపి బుడుమూరు సూర్యారావు మాట్లాడుతూ వితంతువులకు భర్త చనిపోయిన వెనువెంటనే, మరుసటి నెల నుండి పింఛను అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదే నన్నారు. కార్యక్రమంలో నారాయణపురం ఎడమ కాలువ తొాగారం నీటిసంఘం ఉపాధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి భర్త చనిపోయిన వితంతు పేద మహిళలకు గత ముఖ్యమంత్రి జగన్ సకాలంలో పింఛన్లు మంజూరు చేయలేదన్నారు. వారికి ఇప్పటికే పింఛన్లు మంజూరు కాలేదన్నారు. ఒక్క నెల ఏకారణం చేతనైనా పింఛను తీసుకోలేకపోతే ఆనెల పింఛను మొత్తం తిరిగి పొందే సౌకరం తిరిగి తెచ్చినందుకు ముఖ్య మంత్రి చంద్రన్నకు ధన్యవాదాలు తెలిపారు. కర్యమంలో స్థానిక తెలుగుదేశంపార్టీ నాయకులు బుడుమూరు సత్యన్నారాయణ మాట్లాడుతూ ఓ.వి.పేటలో నూతనంగా మూడు స్పౌస్ (వితంతు) పింఛన్లు మంజూరు అయ్యాయన్నారు. వారికి పాత పించనుదారులతో పాటుగా అందించడం జరిగిందన్నారు. సచివాలయం సిబ్బంది పింఛన్లు సకాలంలో అందించేందుకు కృషిచేస్తున్నందుకు వారికి అభినందించారు. ప్రభుత్వం అనుమతి వచ్చినపుడు నూతన పింఛన్లు దరఖాస్తులు స్వీకరిస్తామని పలువురు అర్హత పొందిన వారికి చెప్పారు. కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బుడుమూరు మురళీధర్, మెట్ట మోహనరావు, బుడుమూరు మల్లేశ్వరరావు, చిగురుపల్లి లక్కున్నాయుడు, స్థానిక ఇంజనీరింగ్ అసిస్టెంట్ కల్పన, చిగురుపల్లి విజయలక్ష్మి, పించనుదారులు వున్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించి జ్ఞాపకాలు అందజేసిన సి.పి.....



రామగుండం/డిసెంబర్ 31(జనం రిపోర్టర్): పోలీస్ శాఖ నందు సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన వారి కోసం మంగళవారం రామగుండం పోలీస్ కమీషనర్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో రామగుండము పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ పాల్గొని, పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీస్ అధికారులను కుటుంబ సభ్యుల తో కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళ వారం పదవీ విరమణ పొందిన టి.లక్ష్మణ్ ఎఆర్ ఎస్ఐ 1989 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి కానిస్టేబుల్ గా ఎంపికై, అంచలంచలుగా ఎదిగి 35 సంవత్సరముల,8 నెలలు విధులను నిర్వర్తించడం జరిగింది. 15-కాష్ రివార్డు ,01-ప్రభుత్వ ప్రాయోజిత సంస్థ చే పొందారు. 2. ఎస్. కే అక్బర్ పాషా ఎస్ ఐ శ్రీరాంపూర్ 1989 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి కానిస్టేబుల్ గా ఎంపికై, అంచలంచలుగా ఎదిగి 35 సంవత్సరముల, 09 నెలల,15 రోజులు విధులను నిర్వర్తించడం జరిగింది. 04-కాష్ రివార్డు ,01-ప్రభుత్వ ప్రాయోజిత సంస్థ చే పొందారు. 3. ఎ.రాములు ఎస్ ఐ మంథని 1982 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి కానిస్టేబుల్ గా ఎంపికై అంచలంచలుగా ఎదిగి, 42 సంవత్సరముల, 01 నెల,03 రోజులు విధులను నిర్వర్తించడం జరిగింది. 05-కాష్ రివార్డు ,03-ప్రభుత్వ ప్రాయోజిత సంస్థ చే పొందారు.4. షఫీ ఉల్లా ఖాన్ ఏఎస్ ఐ -1471 శ్రీరాంపూర్ పిఎస్ 1989 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి కానిస్టేబుల్ గా ఎంపికై అంచలంచలుగా ఎదిగి,35 సంవత్సరముల, 06 నెలల,25 రోజులు విధులను నిర్వర్తించడం జరిగింది. 043-కాష్ రివార్డు ,07-ప్రభుత్వ ప్రాయోజిత సంస్థ చే 02 ప్రశంసా పత్రాలు పొందారు.5. వి రవీందర్ ఏఎస్ ఐ పెద్దపల్లి అటాచ్ పీసీఆర్ రామగుండం 1989 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి కానిస్టేబుల్ గా ఎంపికై అంచలంచలుగా ఎదిగి, 35 సంవత్సరముల, 05 నెలల,14 రోజులు విధులను నిర్వర్తించడం జరిగింది. 01- ప్రశంసా పత్రం ,01-ప్రభుత్వ ప్రాయోజిత సంస్థ చే పొందారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ... గతంలో పోలీసు వ్యవస్థ అత్యంత క్లిష్ట పరిస్థితుల నందు విధులను నిర్వర్తించి, ప్రస్తుతం పోలీసు వ్యవస్థ ప్రశాంతంగా ఉండడానికి గల కారణమైన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. సుదీర్ఘ కాలం పాటు పోలీసు వ్యవస్థను సేవలందించి పదవీ విరమణ పొందుతున్నందుకు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని, వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరని తెలియజేశారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించాలని సిబ్బందికి తెలియజేశారు. ఉద్యోగ విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని సూచించారు. తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. ఎటువంటి అవసరం ఉన్న కమీషనరేట్ పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు, ఎఆర్ ఏసీపీ ప్రతాప్ సుందర్ రావు, ఏ ఓ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు దామోదర్, వామన మూర్తి, శ్రీనివాస్, మల్లేశం, సంపత్, సూపరిండెంట్స్ ఇంద్రసేనారెడ్డి, మనోజ్ కుమార్, సంధ్య, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లా కుంట పోచలింగం, స్వామి, పదవి విరమణ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ వారి హెచ్చరిక




నార్పల/డిసెంబర్ 31(జనం రిపోర్టర్): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హద్దుమీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవు..శింగనమల సీఐ కౌలుట్లయ్య అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీ జగదీష్ గారి ఆదేశాల మేరకు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి శింగనమల,నార్పల,గార్లదిన్నె మండలాల ప్రజలకు ముఖ్య విజప్తి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హద్దుమీరి ప్రవర్తిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని శింగనమల సీఐ కౌలుట్లయ్య శింగనమల,నార్పల గార్లదిన్నె మండల ప్రజలకు తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన, మద్యం మత్తులో అల్లర్లకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు అర్ధరాత్రి ఆరుబయట వేడుకలకు అనుమతులు లేవు. సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ మరియు సెక్షన్ 144 సి.ఆర్.పి.సి. మలులో ఉన్నందున బహిరంగ ప్రదేశాలలో ఐదుగురు అంతకన్నా ఎక్కువ వ్యక్తులు గుమిగూడటం నిషేధం. ఆరుబయట ప్రదేశాలలో డి.జె.లు మరియు ఎక్కువ శబ్దాన్ని ఇచ్చే సౌండ్ సిస్టంను వినియోగించరాదు. మద్యం సేవించి రోడ్లపై వాహనములు నడుపరాదు, అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకొనబడును. గుంపులు, గుంపులుగా చేరి నడి రోడ్డుపై కేకులు కోసి అల్లర్లు చేయరాదు. డిసెంబర్ 31వ తేదీన రాత్రి వేళ కేకలు వేస్తూ వాహనాలపై తిరగ రాదు. డిసెంబర్ 31వ తేదీన రాత్రి టౌన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో గస్తీ ముమ్మరంగా ఉంటుంది.

ప్రత్యేక హెచ్చరిక:- మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి,ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తీసేసి అధిక శబ్దాలతో హెూరెత్తించడటం, బాణాసంచా పేల్చడం వంటి వాటి వలన ప్రశాంతతకు భంగం కలిగి వృద్ధులకు, చిన్న పిల్లలకు, రోగులకు, ఇబ్బంది కలుగుతుంది. కావున ఇలాంటి వాటికి పాల్పడితే తగిన చర్యలు తీసుకొనబడును. అధిక మత్తు వల్ల విచక్షణ కోల్పోయి దుర్మార్గపు పనులు చేసే అవకాశం ఉంది. అలాగే ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి.మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా. ఈవ్ టీజింగ్ కు పాల్పడినా చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోబడును. తల్లిదండ్రులు ఈవిషయాలను గమనించి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసినదిగా శింగనమల సీఐ కౌలుట్లయ్య విజప్తి చేశారు

# పోరుబాట పడుతున్న వైసిపి



భీమవరం, డిసెంబర్ 31 జనం రిపోర్టర్: భీమవరం నుండి కలెక్టరేట్ ను ఉండి నియోజకవర్గానికి తరలించేందుకు కూటమి ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలు ప్రయత్నిస్తుండటంతో భీమవరంలో వైయస్సార్ సిపి పోరాటం చేసే దిశగా అడుగులు వేస్తుంది. మంగళవారం భీమవరంలో జరిగిన మీడియా సమావేశంలో వైసిపి నాయకులు కామన నాగేశ్వరరావు, గూడూరి ఉమాబాల, చినమిల్లి వెంకటరాయుడు, చవ్వాకుల సత్యనారాయణ, జల్లా కొండయ్య, గాదిరాజు రామరాజులు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై అప్పటి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజులు ఒత్తిడి తీసుకొచ్చి భీమవరం కు జిల్లా కేంద్రాన్ని తీసుకురావడం జరిగింది అన్నారు. అయితే నేటి కూటమి ప్రభుత్వం పెద్దలు కలెక్టరేట్ ను ఉండి నియోజకవర్గ పరిధిలోని పెద అమిరం కు తరలించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు భీమవరం కు ఎయిర్ పోర్ట్ తీసుకొస్తానని చెబుతున్నారని, ఎయిర్ పోర్ట్ మాట దేవుడెరుగు, కలెక్టరేట్ ను భీమవరం నుండి వేరే నియోజకవర్గానికి తరలించకుండా చూడాలని కోరారు. ఇప్పటికైనా కూటమి పెద్దలు తమ ఆలోచనను మార్చుకోకపోతే పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు వైసిపి నేతలు.

# ప్రభుత్వ ఆసుపత్రి పెద్దది !

## డ్యూటీలో ఉన్నది ఒక్కరు !!



నార్పల / డిసెంబర్ 31(జనం రిపోర్టర్): మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సిబ్బంది ఒక్కరు మినహా మిగిలిన సిబ్బంది అంతా గైర్హాజరవ్వడం గమనార్హం. ప్రభుత్వాసుపత్రిలో ఇద్దరు ప్రధాన వైద్యాధికారులు కూడా గైరహాజరవ్వడం, సిబ్బందిలో కేవలం ఒకరు మాత్రమే డ్యూటీలో ఉండటం విశేషం. బహుశా డిసెంబర్ 31 అనగా ఇయర్ ఎండింగ్ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది సెలవు పైన వెళ్ళారేమో అని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఇయర్ ఎండింగ్ అవ్వడం వలన ఏదైనా ప్రమాదం జరిగితే ప్రమాదం జరిగిన వ్యక్తులు ఆస్పత్రికి వస్తే వారి పరిస్థితి ఎవరు చూస్తారని బయట ప్రజలు చర్చించుకుంటున్నారు.



# గ్రామపంచాయతీ డెవలప్మెంట్ సభ నిర్వహించిన అంతర్గాం తాసిల్దార్ తూమ్ రవీందర్ పటేల్.....



రామగుండం/డిసెంబర్ 31(జనం రిపోర్టర్): పెద్దపల్లి జిల్లా అంతర్గం మండల కేంద్రంలోని టిటిఎస్ అంతర్గాం, మురుమూరు గ్రామపంచాయతీలలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ పరిశీలన గ్రామసభ నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన అంతర్గాం తాసిల్దార్ తూము రవీందర్ పటేల్ ఆ గ్రామపంచాయతీలలో ఉన్నటువంటి సమస్యలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా, గ్రామపంచాయతీలో గల వివిధ శాఖలకు సంబంధించిన అధికారుల ద్వారా, అలాగే గ్రామ ప్రజల ద్వారా ఆ ఊరిలో ఉన్నటువంటి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. అనంతరం ఆ గ్రామపంచాయతీలో ఉన్నటువంటి సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తానని, నాతో కానటువంటి వాటిని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే గ్రామపంచాయతీలో గల సమస్యలను పరిష్కారం చేస్తానని అంతర్గాం తాసిల్దార్ తూమ్ రవీందర్ పటేల్ తెలిపారు.



అనంతరం టిటిఎస్ అంతర్గాం గ్రామపంచాయతీ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది, మురుమూరు గ్రామపంచాయతీ ప్రజలు, సిబ్బంది ,మురుమూరు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కన మల్ల రాకేష్,గ్రామపంచాయతీ కార్యదర్శి కమల, గ్రామ సిబ్బంది, అంతర్గం తాసిల్దార్ తూమ్ రవీందర్ పటేల్ ను శాలువలతో బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంతర్గం తాసిల్దార్ తూమ్ రవీందర్ పటేల్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, ముందస్తుగా నూతన సంవత్సర కేక్ కట్ చేసి అంతర్గాం మండలంలోని ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు నా ప్రత్యేక నూతన సంవత్సర శుభాకాంక్షలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం తాసిల్దార్ తూమ్ రవీందర్ పటేల్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు టిటిఎస్ అంతర్గం కార్యదర్శి అంకం రవికుమార్, మురుమూరు గ్రామ కార్యదర్శి కమల, వివిధ శాఖలకు సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మోగధరమ్మతల్లి ఆటో డ్రైవర్స్ యూనియన్ (సీఐటీ దుయూ) నిజాంపట్నం ఆటో సాండ్లో డ్రైవర్స్ కీ కాకి యూనిఫామ్,స్వీట్ బాక్స్ లు పంపిణీ



రేపల్లె డిసెంబర్ 25 జనం రిపోర్టర్: నూతన సంవత్సరంలోకి వెళుతున్న సందర్భంగా ఆటోస్టాండ్ వద్ద జరిగిన సమావేశంలో స్టాండ్ లో సభ్యత్వం ఉన్నటువంటి డ్రైవర్స్ కి యూనిఫామ్ పంపిణీ చేయడం.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ప్రజాప్రతినిధులు మోపిదేవి.హరినాథ్ బాబు మరియు సిఐటియు జిల్లాఅధ్యక్షులు సిహెచ్.మణిలాల్ మరియు స్థానిక పెద్దలు పాల్గొని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ డ్రైవర్లకు యూనిఫామ్ చాలా ఆవసరమని డ్రైవర్ నైపుణ్యంతో అనేకమంది ప్రాణాలను కాపాడుతున్నాడని అటువంటి ఆటోడ్రైవర్లు క్రమశిక్షణతో జీవనంగడపాలని,ఆటోలు ద్వారా ఉపాధిపొంది తమ కుటుంబాలతో సంతోషంగా రాబోయే 2025 సంవత్సరంలో మంచిగా గడపాలని కోరారు,ప్రతి డ్రైవరు లైసెన్స్ కలిగి యూనిఫామ్ ధరించి నిజాంపట్నం ఆటో డ్రైవర్స్ అంటే క్రమశిక్షణ కలిగి ఉంటారని గుర్తింపు ఉండే విధంగా ఉండాలని అన్నారు. ఎటువంటి గొడవలు లేకుండా డ్రైవర్ల అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో మోగధరమ్మ తల్లి ఆటోడ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు పి.సురేష్,బాపట్ల జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ ప్రధానకార్యదర్శి సిహెచ్. ప్రహ్లాదుడు,నిజాంపట్నం నుండి బాపట్ల వెళ్లే డ్రైవర్లు,మరియు స్థానిక పెద్దలు ప్రసాద్ వాసుదేవం,మరక.శ్రీను,భూ శంకర్,చంటి తదితరులు పాల్గొన్నారు..

# సింగరేణి అధికారుల పూర్తి నిర్లక్ష్య వైఖరితో, సామల రామ్మూర్తి ఇ.పి. గ్రీజర్ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుడు....



## అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జనక్ ప్రసాద్ డిమాండ్...

రామగుండం /డిసెంబర్ 31(జనం రిపోర్టర్): రామగుండం ఏరియా-2, ఒసిపి-3, పైలట్ క్వారీ ప్రగతి షవల్ పై విధులు నిర్వహిస్తున్న సామల రామ్మూర్తి ఇ.పి గ్రీజర్ విధులు నిర్వహిస్తున్న సమయంలో విశావాయువులతో పొగలు, అకస్మాత్తుగా మిషన్ పై నుండి పడిపోయినాడని, ప్రాణాపాయ స్థితి నుండి డిస్పెన్సర్కి తరలించడానికి అంబులెన్స్ సౌకర్యం అందగా డిస్పెన్సరీలో సమయానికి డాక్టర్ అందుబాటులో లేకపోవడం మూలముగా ప్రాణాలు కోల్పోయిన సామల రామ్మూర్తి మృతిపై డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ ద్వారా విచారణ జరిపించి, బాధ్యులైన అధికారుల పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.



# నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన దద్దాల

(కనిగిరి డిసెంబర్ 31 జనంరిపోర్టర్ ): 2025 నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి సుఖ సంతోషాలు కలగాలని కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆకాంక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి కి కనిగిరి నియోజకవర్గ ప్రజలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గ ప్రజలందరు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో నూతన సంవత్సరం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు

# శ్రీ పాండురంగ మెమోరియల్ స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్



జిన్నారం జనం రిపోర్టర్ డిసెంబర్ 31: జిన్నారం మండలం గడ్డపోతారం శ్రీ పాండురంగ మెమోరియల్ స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థులకు సైన్స్ పరంగా అవగాహన తెలిపేందుకు గొప్ప ఆలోచనలు సమాజానికి ఉపయోగపడే లాగా విద్యార్థులను తయారు చేసి సైన్స్ పరంగా ఆలోచనలు పెంచి గొప్ప గొప్ప ఆవిష్కరణలు చేయగలరు ఇప్పటినుండి పిల్లలకు సైన్స్ పరంగా విధివిధానాలు చూయించి నేర్పించి వారిని ప్రయోజకులను చేసి తీర్చిదిద్దాలని సమాజానికి ఉపయోగపడే పరికరాలను తయారుచేసి ప్రయోజకులను చేయాలని కోరారు పాండురంగ మెమోరియల్ స్కూల్ టీచర్లు మరియు వారి బృందం కలిసి సైన్స్ ఎగ్జిబిషన్ పెట్టడం జరిగింది




# నూతన సంవత్సరము ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి



రేపల్లె డిసెంబర్ 31 జనం రిపోర్టర్: 2024 వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025 సంవత్సరంలో ప్రజలందరూ సుఖశాంతులు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో పిల్లాపాపలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నామని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు శాఖ మంత్రి అనగానిసత్యప్రసాద్ తెలియజేశారు నూతన సంవత్సర శుభాకాంక్షలు ప్రజలకు తెలియజేసిన వారిలో మాజీ మంత్రి మాది రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు కాంగ్రెస్ పార్టీ నాయకులు మోపిదేవి శ్రీనివాసరావు అధికారులు ఆర్డిఓ రామలక్ష్మి. తాసిల్దార్ ఎం శ్రీనివాసరావు మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు ఎక్సైజ్ శాఖ సీఐ దివాకర్ ఎంపీడీవో శోభ రాణి సీఐలు మల్లికార్జున్ రావు సురేష్ బాబు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు

# మోగధరమ్మతల్లి ఆటో డ్రైవర్స్ యూనియన్ (సీఐటీ దుయూ) నిజాంపట్నం ఆటో సాండ్లో డ్రైవర్స్ కీ కాకి యూనిఫామ్,స్వీట్ బాక్స్ లు పంపిణీ



రేపల్లె డిసెంబర్ 31జనం రిపోర్టర్ : నూతన సంవత్సరంలోకి వెళుతున్న సందర్భంగా ఆటోస్టాండ్ వద్ద జరిగిన సమావేశంలో స్టాండ్ లో సభ్యత్వం ఉన్నటువంటి డ్రైవర్స్ కి యూనిఫామ్ పంపిణీ చేయడం.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ప్రజాప్రతినిధులు మోపిదేవి.హరినాథ్ బాబు మరియు సిఐటియు జిల్లాఅధ్యక్షులు సిహెచ్.మణిలాల్ మరియు స్థానిక పెద్దలు పాల్గొని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ డ్రైవర్లకు యూనిఫామ్ చాలా ఆవసరమని డ్రైవర్ నైపుణ్యంతో అనేకమంది ప్రాణాలను కాపాడుతున్నాడని అటువంటి ఆటోడ్రైవర్లు క్రమశిక్షణతో జీవనంగడపాలని,ఆటోలు ద్వారా ఉపాధిపొంది తమ కుటుంబాలతో సంతోషంగా రాబోయే 2025 సంవత్సరంలో మంచిగా గడపాలని కోరారు,ప్రతి డ్రైవరు లైసెన్స్ కలిగి యూనిఫామ్ ధరించి నిజాంపట్నం ఆటో డ్రైవర్స్ అంటే క్రమశిక్షణ కలిగి ఉంటారని గుర్తింపు ఉండే విధంగా ఉండాలని అన్నారు. ఎటువంటి గొడవలు లేకుండా డ్రైవర్ల అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో మోగధరమ్మ తల్లి ఆటోడ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు పి.సురేష్,బాపట్ల జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ ప్రధానకార్యదర్శి సిహెచ్. ప్రహ్లాదుడు,నిజాంపట్నం నుండి బాపట్ల వెళ్లే డ్రైవర్లు,మరియు స్థానిక పెద్దలు ప్రసాద్ వాసుదేవం,మరక.శ్రీను,భూ శంకర్,చంటి తదితరులు పాల్గొన్నారు...

# పెన్షన్ దారుల కళ్ళల్లో ఆనందం చూస్తున్నాం

## వైస్ సర్పంచ్ అలం వెంకట నరసానాయుడు..




నార్పల /డిసెంబర్ 31(జనం రిపోర్టర్): నార్పల మండలం బొందలవాడ గ్రామంలో గ్రామంలో కొత్తగా స్పౌస్ పెన్షన్ ను వైస్ సర్పంచ్ ఆలం వెంకట నరసానాయుడు, ఎమ్మార్వో అరుణ కుమారి అందజేశారు. బొందలవాడ గ్రామంలో భర్త చనిపోయిన నెలరోజుల్లోపే పౌల్ పెన్షన్ పేరుతో కొత్తగా పెన్షన్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా వైస్ సర్పంచ్ అలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ స్పౌస్ పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వం అందించడంలో చంద్రబాబు నాయుడు గారి మానవత్వం మరొకసారి నిరూపించారు. పెన్షన్ తీసుకుంటున్న వితంతువు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, విఆర్ఓ దాదా పీర్, వెల్ఫేర్ అసిస్టెంట్ శంషాద్ బేగం సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# స్పీకర్ చేతుల మీదుగా పి ఆర్ టి యు వికారాబాద్ జిల్లా క్యాలండర్ ఆవిష్కరణ..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 31 (జనం రిపోర్టర్): తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా 2025 నూతన సంవత్సర క్యాలండర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా పి ఆర్ టి యు వికారాబాద్ జిల్లా శాఖ అధ్యక్షులు కడియాల చంద్రశేఖర్ , ప్రధాన కార్యదర్శి దోమ అమర్ నాథ్ , రాష్ట్ర బాధ్యులు వీరేశ, గోపాల్ , జిల్లా బాధ్యులు రాజశేఖర్ , బాబ్యానాయక, అశోక్ , వికారాబాద్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు కేదర్ నాథ్ , రాఘవేందర్, అసోషియేట్ అధ్యక్షులు సి. శ్రీనివాస్, పరిగి అధ్యక్షులు బుగ్గన్న , వెంకటయ్య , ప్రకాష్ తదితరులు పాల్గొన్నార.

# కూటమి ప్రభుత్వంలో చెరువులకు జలకళ

## టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు




నందలూరు /డిసెంబర్ 31(జనం రిపోర్టర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో చెరువులకు జలకల సంతరించుకుందని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. మంగళవారం నాగిరెడ్డిపల్లి లోని ఎర్ర చెరువుకు అలుగు పారడంతో ఆయన గంగమ్మకు పూజలు నిర్వహించి జల హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అరాచక పాలనకు విసిగిపోయిన ప్రజలు ఎన్డీఏ కు దేశంలోనే అత్యధిక మెజార్టీ తో పట్టం కట్టారని అన్నారు. సీఎం ఒక మంచి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆర్థికంగా వెనకబడిన, అప్పుల పాలైన రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు చర్యలు చేపట్టారని అన్నారు. అధికారులు, పార్టీ యంత్రాంగం సమిష్టిగా కృషిచేసి చెయ్యేరు నది నుంచి కాలువల ద్వారా చెరువులకు నీరు తెప్పించారని అన్నారు. నందలూరు మండలంలోని నాలుగు చెరువులకు రాజంపేట ప్రాంతాల్లోని నాలుగు చెరువులకు నీరు అందించడం జరుగుతుందని అన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరిగి త్రాగునీటికి, సాగునీరు కు ఎటువంటి ఇబ్బందులు కలగవని అన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య డ్యాం డీఈ మురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ మధుసూదన్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, పాటూరు గ్రామ అధ్యక్షులు ముమ్మడి శెట్టి రమేష్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, నీటి సంఘం అధ్యక్షుడు భూశెట్టి వెంకటసుబ్బయ్య, టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ నాయకులు పసుపులేటి ప్రవీణ్, తాటి సుబ్బరాయుడు, గంధం గంగాధర్, నారపు శెట్టి శివ, గంగనపల్లి శ్రీనివాసులు, మునుస్వామి,ఆన్సర్, గౌస్ బేగ్, జనసేన నాయకులు ఆకుల చలపతి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# నిడుబ్రోలు జడ్పీ పాఠశాలలో సైన్స్ ఫెయిర్..







పొన్నూరు డిసెంబర్ 31. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని నిడిబ్రోలు జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం మండల సైన్స్ ఫెయిర్, క్విజ్ పోటీలు జరిగింది. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సైన్స్ పరికరాల నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. పిబిఎన్ కళాశాల ప్రిన్సిపల్ మాధవి, ఉషారాణి ,రిటైర్డ్ లెక్చరర్ వెంకటేశ్వర్లు న్యాయ నిర్ణీతలుగా వ్యవహరించారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ సైన్సు నమూనాలను తిలకించి వ్యక్తిగత, గ్రూపులుగా తయారు చేసిన నమూనాల విజేతలను ప్రకటించారు. అలానే క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివలక్ష్మి, మండల నోడల్ అధికారి శేష తల్ప సాయి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. మండల స్థాయి పోటీలలో గెలుపొందిన వారు వచ్చే నెల 3వ తేదీన జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనాలని నోడల్ అధికారి శేష తల్ప సాయి తెలిపారు.

# పుట్ట గొడుగుల సాగు పై అవగాహన సదస్సు



చొప్పదండి,జనం రిపోర్టర్,డిసెంబర్ 31: చొప్పదండి పట్టణంలోని స్థానిక రైతు వేదికలో మంగళవారం రోజున రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి జె.భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం వారు మాట్లాడుతు....రైతుల కు పుట్ట గొడుగులు సాగు విధానం మరియు వాటి లాభాల పైన రైతు ల కు అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు వంశీకృష్ణ, రమ్య జ్యోత్స్న,వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు రైతులు గుర్రం రవీందర్ రెడ్డి, రామ్ రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది.

# బీహార్ ప్రభుత్వ తీరును ఎండగట్టిన పలువురు నేతలు

పాట్నా : బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బిపిఎస్సి) అభ్యర్థులపై బీహార్ ప్రభుత్వ తీరును సోమవారం పలువురు నేతలు తీవ్రంగా ఎండగట్టారు. నిరంకుశ చర్యలను ఖండిస్తూ విమర్శలు గుప్పించారు. 70వ బిపిఎస్సి ప్రిలిమినరీ పరీక్షను తిరిగి నిర్వహించాలని ఆందోళన చేపడుతున్న అభ్యర్థులపై ఆదివారం పోలీసులు విరుచుకుపడిన సంగతి తెలిసిందే. వారిపై లాఠీచార్జ్ చేయడంతో పాటు వాటర్ కెనాన్‌లను ప్రయోగించారు.ఎతీవ్రమైన చలి పరిస్థితులలో బిపిఎస్సి అభ్యర్థులపై లాఠీచార్జ్‌కి దిగడం, వాటర్ కెనాన్‌లు ప్రయోగించడం అమానుషమని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ మండిపడ్డారు. బీహార్ ప్రభుత్వం విద్యార్థులను హింసించడం మూడు రోజుల్లో ఇది రెండోసారి. అవినీతిని అరికట్టడం, రిగ్గింగ్, పరీక్షా పత్రాల లీకేజీని అరికట్టడం ప్రభుత్వం పని అని ఎక్స్‌లో పేర్కొన్నారు. అవినీతిని అరికట్టడానికి బదులుగా బీహార్ ప్రభుత్వం వారి గొంతుక వినిపించకుండా అణచివేస్తోందని దుయ్యబట్టారు. చలిలో వాటర్ కెనాన్‌లు ప్రయోగించడం అమానుషమని ధ్వజమెత్తారు. బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ యువతపై రెట్టింపు దాడులకు ప్రతీకగా మారిందని అన్నారు. కాగా, అభ్యర్థులపై పోలీసుల చర్య బాధాకరమని బీహార్ మాజీ డిప్యూటీ సిఎం, ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్ పేర్కొన్నారు. పోలీసుల లాఠీచార్జ్‌లో పలువురు అభ్యర్థులకు తీవ్ర గాయాలయ్యాయని, ఈ చర్యను ఖండిస్తున్నామని అన్నారు. సోషల్ మీడియాలో వైరలవుతున్న దృశ్యాలు బాధ కలిగిస్తున్నాయని, ఒక యువకుడిగా వారి పరిస్థితిని తాను అర్థం చేసుకోగలనని అన్నారు. నిరంకుశ ప్రభుత్వ నియంతృత్వానికి ఈ చర్య నిదర్శనమని ఆప్ ఎంపి సంజరు సింగ్ పేర్కొన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నుండి ఈ ప్రవర్తనను ఊహించలేదని అన్నారు. ఈ ఘటనను ఏకలవ్య బటనవేలుతో పోలుస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ఏకలవ్యుని బటనవేలుని నరికివేసినట్లు ప్రశ్నా పత్రాలను లీక్ చేయడం ద్వారా యువత భవిష్యత్తును నరికివేస్తోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.ఐ

# పురోహితులకు ప్రత్యేక పథకం ప్రకటించిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న నేపథ్యంలో మహిళల కోసం 'మహిళా సమ్మాన్ యోజన', వద్దులకు చికిత్స కోసం 'సంజీవని యోజన' పథకాలను ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దేవాలయాల పూజారులకు 'పూజారి, గ్రంథి సమ్మాన్ యోజన' పథకాన్ని సోమవారం కేజ్రీవాల్ ప్రకటించారు. ఈ పథకం కింద ప్రభుత్వం పూజారులకు గౌరవ వేతనం కింద రూ.18 వేలు ఇవ్వనుంది. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను ఈరోజు ఒక పథకానికి సంబంధించి ముఖ్యమైన ప్రకటన చేస్తున్నాను. ఈ పథకం పేరు పూజారి, గ్రంథి సమ్మాన్ యోజన. ఈ పథకం కింద ఆలయాల అర్చకులకు, గురుద్వారాలోని 'గ్రంథీ'లకు గౌరవ వేతనంగా రూ.18 వేలు ఇవ్వనున్నాం. పురోహితుల కోసం ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టడం దేశంలోనే తొలిసారి. పౌరోహిత్యాన్ని, ఆచార వ్యవహారాలను ముందుకు తీసుకెళ్లడమే ఈ పథకం ఉద్దేశం. ఇప్పటి వరకూ పురోహితులపై కానీ, వారి కుటుంబాలకు సంబంధించి కానీ ఎప్పుడూ దృష్టి పెట్టలేదు. వారిని, వారి కుటుంబాలను ఎన్నడూ పట్టించుకోలేదు. వారి పట్ల తగినంత శ్రద్ధ చూపలేదు. అందుకే వారి కోసం, వారి కుటుంబ సభ్యులను దృష్టిపెట్టుకుని మేము ఈ పథకాన్ని ప్రవేశపెట్టనున్నాం. ఇలాంటి పథకం దేశంలోనే తొలిసారి ప్రవేశపెడుతున్నది మా ప్రభుత్వమే. మేము అనేక పనులు చేశాం. అనేక పాఠశాలలను, ఆసుపత్రులను మెరుగుపరిచాం. మహిళలకు ఉచిత బస్సును ప్రకటించాము. మేము ప్రవేశపెట్టిన పథకాలను బిజెపి, కాంగ్రెస్‌లు అనుసరించాయి. ఆ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఆ పథకాలను అమలు చేస్తాయని నేను ఆశిస్తున్నా' అని చెప్పారు. కాగా, ఆప్ ప్రకటించిన మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన పథకాలపై బిజెపి నేతలు మండిపడుతున్నారు. వీటికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఢిల్లీలోని వక్ఫ్‌బోర్డు ఇమామ్‌లు 17 నెలలుగా జీతాలు చెల్లించలేదని ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు.ఎ

# కేజ్రీవాల్ నివాసం ఎదుట ఢిల్లీ వక్ఫ్‌బోర్డు ఇమామ్‌ల నిరసన

న్యూఢిల్లీ : గడిచిన ఏడాదిన్నరగా ఆప్ ప్రభుత్వం తమకు జీతాలు చెల్లించలేదని.. వెంటనే తమ జీతాల్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీ వక్ఫ్‌బోర్డుకు చెందిన ఇమామ్‌లు ఆప్ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసం ఎదుట నిరసన చేశారు. ఈ నిరసనల్లో పాల్గొన్న ఆల్ ఇండియా ఇమామ్ అసోసియేషన్ ఛైర్మన్ సాజిద్ రషిది మీడియాతో మాట్లాడుతూ.. '17 నెలలు కావస్తున్నా ఆప్ ప్రభుత్వం మాకు జీతాలు చెల్లించలేదు. మా జీతాల చెల్లింపులకు సంబంధించిన విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి, లెఫ్టినెంట్ గవర్నర్, సీనియర్- జూనియర్ అధికారులతో చర్చించాము. జీతాల చెల్లింపులపై వారు మాకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అందుకే కేజ్రీవాల్ నివాసం ఎదుట నిరసన చేపట్టాల్సివచ్చింది. మాకు సరైన సమాధానం ఇచ్చేంతవరకు ఆందోళనలు కొనసాగుతాయి. ఇకపై ఆందోళనలను ఉధృతం చేస్తాము' అని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఆధ్యాత్మిక పల్లె.. కొలనుపాక

## జైనుల ఆధ్యాత్మిక కేంద్రం.. సోమేశ్వరుడు కొలువైన క్షేత్రం

## దక్షిణ కాశీగా వీరశైవ మఠాల ఆధ్యాత్మిక నగరిగా గుర్తింపు

## రాష్ట్రకూట, చాళుక్య, కందూరు చోళ, కాకతీయుల పాలనా కేంద్రం

## శైవ, బౌద్ధ, జైన, వైష్ణవాల ఘర్షణలో అస్థిత్వాన్ని కోల్పోయిన తీరు

## నేడు అచ్చమైన పల్లెటూరుగా మారిన వైనం





సోమేశ్వర ఆలయంలో శివ లింగం



కొలనుపాకలో ఉన్న పురాతన కట్టడం మండపం



కొలనుపాకలో పురాతన కోమట్ల మఠం

యాదగిరిగుట్ట: స్వయంభూ సోమేశ్వరుడు కొలువైన క్షేత్రం. వీరశైవ పంచాచార్యులలో ఒకరైన రేవణ సిద్ధేశ్వరుని జన్మభూమి. శ్వేతాంబర జైనుల ఆధ్యాత్మిక కేంద్రం. దైవారాధనకు అందరూ అర్హులేనని చాటిన సమతా సందేశం. వీరశైవాన్ని దశదిశలా వ్యాప్తి చేసిన దక్షిణ కాశీ. అష్టాదశ కులాల వీరశైవ మఠాల ఆధ్యాత్మిక నగరి. రాష్ట్రకూట, చాళుక్య, కందూరు చోళ, కాకతీయుల పాలనా కేంద్రం. గత వైభవ ఘనకీర్తి పతాక.. కొలనుపాక. ఇది శతాబ్దాల కిందట ఓ సుందర నగరం. ఇప్పుడు అచ్చమైన పల్లెటూరు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి 6 కి.మీ. దూరంలో ఉంది. వెయ్యేళ్లకు పూర్వమే ఓ వెలుగు వెలిగిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, రాజకీయ రంగస్థలి. జైన వైభవానికి, వీరశైవ విజృంభణకు నిలువెత్తు సాక్ష్యం. కానీ శైవ, బౌద్ధ, జైన, వైష్ణవాల ఘర్షణలో తన అస్థిత్వాన్ని కోల్పోయింది. నాటి కులమఠాల ఆనవాళ్లు కొలనుపాక సామాజిక జీవితాన్ని మనకు కథలుగా చెబుతాయి.

### పంచముఖాలు.. ఐదు పీఠాలు

రాష్ట్రకూటులు, పశ్చిమ చాళుక్యులు, కందూరు చోళుల ఉప రాజధానిగా తెలుగు నేలపై అర్ధభాగాన్ని శాసించినా కొలనుపాక ఏనాడూ చరిత్ర కెక్కలేదని పలువురు అంటున్నారు. విధ్వంసకారులు చారిత్రక కట్టడాలను ధ్వంసం చేసినట్లే.. చరిత్రకారుల నిర్లక్ష్యం సాంస్కృతిక వికాసానికి గొడ్డలి పెట్టుగా పరిణమించింది. వీరశైవ మత వ్యాప్తి కోసం శివుని పంచముఖాల నుంచి రేవణసిద్ధ (బాళెహొణ్ణూరు పీఠం), మరులసిద్ధ (ఉజ్జయిని పీఠం), ఏకోరామ (కేదారనాథ్ పీఠం), మల్లికార్జున పండితారాధ్య (శ్రీశైల పీఠం), విశ్వారాధ్య (కాశీ పీఠం) ఉద్భవించినట్టు శైవాగమాలు పేర్కొంటున్నాయి. స్వయంభువులుగా భావించే ఈ శివాచార్యులను 'వీరశైవ పంచాచార్యులు'గా కీర్తిస్తారు. పంచాచార్యులలో ప్రథముడైన రేవణసిద్ధ (రేణుకాచార్యులు) కొలనుపాకలో స్వయంభూ సోమేశ్వర లింగం నుంచి ఉద్భవించినట్టు స్వయంభువాగమం చెబుతోంది. శైవాగమాలలోని వీరాగమ, సుప్రభేదాగమాలు రేణుకాచార్యులను ప్రస్తావించాయి.

### శైవం.. జైనం బహుళ ఆదరణ

కొలనుపాకలో శైవం, జైనం బహుళ ఆదరణ పొందాయి. వేల సంవత్సరాలు ఈ రెండు మతాలు సహజీవనం చేశాయి. కొలనుపాకలో క్రీ.శ. 9వ శతాబ్దం నుంచి సోమనాథ ఆలయం అభివృద్ధి చెందింది. ఒకప్పుడు ఇక్కడ జైనం ఎక్కువ. కొలనుపాకలో వెయ్యేళ్లకు పూర్వమే శ్వేతాంబర శాఖకు చెందిన ఆలయాన్ని నిర్మించారు. జైన ప్రాబల్యం ఉన్నా.. సోమేశ్వరుడు నిర్విఘ్నంగా పూజలందుకున్నాడు. చాళుక్యుల తర్వాత కాకతీయులు అధికారంలోకి వచ్చారు. కాకతీయులు తొలినాళ్లలో జైనాన్ని ఆదరించారు. చివరి కాకతీయులు మాత్రం శైవాన్ని ప్రోత్సహించారు. కొలనుపాకలో అప్పటికే వైష్ణవం కూడా ఉంది. పారమార జగద్దేవుడు నిర్మించిన వీరనారాయణ ఆలయం సుప్రసిద్ధం. తర్వాత వచ్చిన పాలకులు ఈ ఆలయాన్ని పట్టించుకోలేదు. కన్నడ దేశపు కాలచూరిని ఏలుతున్న బిజ్జలుని మంత్రి బసవన్న వీరశైవ వ్యాప్తికి కృషి చేశాడు. రేణుకాచార్యులు కొలనుపాకలో వీరశైవాన్ని అభివృద్ధి చేశాడు. వీరశైవం తెలుగు నేలపై రాజాదరణ పొందింది. కాకతీయల ప్రోద్బలంతో ఉచ్ఛస్థితికి చేరింది. శైవాలయాలు, శైవపీఠాలు, శైవమఠాల నిర్మాణాలకు కాకతీయులు సహకరించారు. కొలనుపాకలోని కోటిలింగాల గుడి, ప్రతాపరుద్ర ఆలయం కాకతీయులు కట్టినవే.

### వీరశైవ విజృంభణ

కాకతీయ గణపతి దేవుడి కాలానికి తెలుగు నేలపై శైవం ఆధిపత్యంలోకి వచ్చింది. రాణీరుద్రమదేవి పాలనా కాలానికి వీరశైవం విజృంభించింది. శివుడు తుప్ప ఎవరూ ఉండకూడదనే వాదన మొదలైంది. 11వ శతాబ్దం చివరి సంవత్సరాల్లో శైవ, జైన మతాలు ఘర్షణ పడ్డాయి. కొలనుపాకలోని జైన ఆలయాలును, బసదులను వీరశైవులు ధ్వంసం చేశారు. జైన, వైష్ణవాలయాలను శివాలయాలుగా మార్చారు. కొన్ని ఆలయాల పేర్లు శాసనాలకే పరిమితం అయ్యాయి. వీరశైవం ప్రబలిన తర్వాత ఆరాధ్య శైవం, వైష్ణువం వెనుకబడిపోయాయి. కాకతీయుల నిరాదరణ, వీరశైవుల విజృంభణతో కొలనుపాకలో జైనం క్షీణదశకు చేరుకుంది. రేవణ సిద్ధేశ్వరుల ప్రభావంతో కొలనుపాకలో అన్ని కులాల వారు వీరశైవంలో చేరారు. ప్రతి కులం ఒక మఠాన్ని ఏర్పాటు చేసుకుంది. అష్టాదశ కులాల వారికి కొలనుపాకలో మఠాలున్నాయి. ప్రస్తుతం ఆ కుల మఠాల సంఖ్య 18 కంటే ఎక్కువే.



### శివుడొక్కడే..

కొలనుపాకలోని మఠాల నిర్మాణ శైలి భిన్నంగా ఉంటుంది. వీటన్నింటిలో శివలింగం, నంది విగ్రహం మాత్రమే ఉంటాయి. మరో విగ్రహానికి కానీ, ఇంకో దేవుడికి కానీ ఇక్కడ స్థానం లేదు. ఈ మఠాల నిర్వహణ, పూజా విధానాల్లో ఎంతో సారూప్యం కనిపిస్తుంది. ప్రతి కుల మఠానికి ఒక గురువు, కులపెద్ద బాధ్యులుగా ఉంటాడు. మఠ గురువు, మఠ పెద్ద, సభ్యులైన వీరశైవులు ఇష్టలింగాన్ని ధరిస్తారు. నిత్యం మఠంలోని శివలింగాన్ని కడిగి, పత్రి, పుష్పాలతో పూజ చేసి, నైవేద్యం పెడతారు. ఆ తర్వాతే భోజనం చేస్తారు. మఠాలన్నిటికీ జంగమ దేవరలే గురువులు. 'గురువు'అంటే విద్యా బోధన చేసేవాడని అర్థం. మత బోధన మఠం ప్రధాన బాధ్యత. వీరశైవం వైపుగా ఆకర్షితులైన నిమ్న కులాల వారికి వీరశైవ తత్త్వాన్ని, మోక్ష మార్గాన్ని బోధించేందుకు ఆ కులానికే చెందినవారికి ఇక్కడ శిక్షణ ఇచ్చేవారు. కొలనుపాకలోని కులమఠాలన్నీ రంభాపురి పీఠాన్ని అనుసరిస్తాయి. కుల మఠాలకు ఉన్నట్లుగా పెద్ద మఠానికి ప్రత్యేకమైన కట్టడం ఏమీ లేదు. పెద్ద మఠం గురువుని కులమఠాలన్నీ అనుసరిస్తాయి.

### కులానికో పురాణం..

కొలనుపాకలోని అన్ని కులాలకూ ప్రత్యేకమైన పురాణాలున్నాయి. మఠ గురువుల దగ్గర ఆ ప్రాచీన ప్రతులు ఉంటాయి. వీటిని పండుగ రోజుల్లో మాత్రమే పఠిస్తారు. తమ కులం ఎలా పుట్టింది? ఎలా అభివృద్ధి చెందింది? తమదైన కుల పురాణాల్లో ప్రస్తావించారు. ఎవరికి వారు తమ కులం గొప్పదనే భావనతో ఈ గ్రంథాన్ని రాసుకున్నారు. మిగతా కులాలకు తమ కులమే మూలమనే ప్రతిపాదనా ఉంది. ఇలా ఎవరి కుల సాహిత్యం వారిదే. కాలక్రమంలో కొన్ని కుల చరిత్రలు అంతరించిపోయాయి.

### మఠానికో శివుడు

అందరికీ శివుడే ఆరాధ్య దైవం. ఆ దేవుడిని కూడా తమ కులంవాడిని చేసుకోవడం మఠాల ప్రత్యేకత. కులమఠాల వాళ్లు ఎవరికి వారు.. తమ కులానికి అనుగుణంగా శివుడికి నామకరణం చేశారు. సురాభాండాన్ని తీసే గౌడవారు శివుడిని 'సురాభాండేశ్వరుడు'అని పిలుచుకున్నారు. కోమట్లు 'నగరేశ్వర స్వామి'అని కొలుస్తున్నారు. మేదర మఠంలోని శివుడిని 'కేతేశ్వర స్వామి'గా వ్యవహరిస్తారు. అదే ఆదిదేవుడు మేరు మఠంలో 'శంకర దాసమయ్య'అయ్యాడు.

### 7 వేల గ్రామాలకు రాజధాని

కొలనుపాక ఒకప్పుడు 7 వేల గ్రామాలకు రాజధాని. ఆ గ్రామ ప్రజలకు వీరశైవ తత్త్వాన్ని బోధించి, మోక్షమార్గాన్ని అనుసరించేలా చేయడం కుల గురువుల బాధ్యత. ఆచార్యుల బతుకుదెరువు, కులమఠంలోని సన్యాసుల పోషణ, శివ పూజల నిర్వహణ కోసం 7 వేల గ్రామాలవారు ధనం, ధాన్యం ఇచ్చేవారు. కాబట్టే, కులమఠాల్లో ధూపదీప నైవేద్యాలుకు లోటు రాలేదు. శివారాధన, వీరశైవ బోధన నిరాటంకంగా కొనసాగింది. కాకతీయుల పతనం తర్వాత ఓ వర్గం అధికారంలోకి వచ్చారు. దీంతో వీరశైవులకు కష్టాలొచ్చాయి. కొలనుపాక కుల మఠాలకు ఇచ్చే దానాలపై ఓ వర్గం పన్ను విధించినట్టు తమ తాతలు చెప్పేవారని పలువురు చెబుతున్నారు.

### దక్షిణ కాశీ

కొలనుపాక దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది. కొలనుపాక సమీపంలో 'కాశీ బుగ్గ'అనే నడబావి ఉంది. దానికి పక్కనే చిన్న శివాలయం కూడా ఉంది. శివ భక్తులు కాశీ బుగ్గలోని నీటిని అపర గంగగా భావిస్తారు. ఈ గుడిలోని శివుడిని అపర (కాశీ) విశ్వేశ్వరుడిగా కొలుస్తారు. కాశీ బుగ్గను దర్శించుకుంటే వారణాసిని దర్శించుకున్నట్లేనని శైవుల భావన. ఒకప్పుడు కుల మఠాల్లో జరిగే శివపార్వతుల కల్యాణ వేడుకను చూసేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన శివభక్తులు తమతమ కుల మఠాల్లో జాగారం చేసేవారు. తమ కుటుంబీకులు చనిపోతే దశదిన కర్మ తర్వాత కొలనుపాకకు వచ్చి కులమఠంలో నిద్ర చేసేవారు. తెల్లవారు కాశీ బుగ్గలో అస్థికలు కలిపిపోయేవారు.

# రాజధాని సిద్ధం.. వేడుకలకు జనం సన్నద్ధం



**న్యూఢిల్లీ,:** కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు దేశరాజధాని ఢిల్లీ సిద్ధమైంది. ఈరోజు (మంగళవారం) మధ్యాహ్నం నుంచే రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో సంబరాలు ప్రారంభం కానున్నాయి. ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్, ఇండియా గేట్ తదితర ప్రాంతాల్లో జనం సందడి చేయనున్నారు. న్యూ ఇయర్‌ను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ పోలీసులు వేడుకలు సవ్యంగా సాగేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. కన్నాట్ ప్లేస్, ఇండియా గేట్‌లకు అనుసంధానమైన రహదారులపై రాత్రి 8 గంటల నుండి వాహనాల రాకపోకలను నిలిపివేయనున్నారు. ఈ సమయంలో అన్ని వాహనాలను ఇతర మార్గాల్లో మళ్లించనున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు ఏఐ ఆధారిత కెమెరాలతో పహారా కాస్తున్నారు. అనుమానితులపై నిఘా ఉంచేందుకు వీటిని వినియోగించనున్నారు. ఢిల్లీ పోలీస్ విభాగానికి చెందిన యోధా వాహనాల్లో కమాండోలను మోహరించనున్నారు. వీరు రోడ్లపై తిరుగుతూ అల్లర్లకు పాల్పడేవారి ఆటకట్టించనున్నారు. దీనికి తోడు ఢిల్లీలోని రద్దీ ప్రాంతాల్లో 600 మంది పోలీసులతో పాటు పారామిలటరీ బలగాలను కూడా మోహరించారు. కన్నాట్ ప్లేస్‌లో 50కి పైగా పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో పోలీసులు మోటార్ సైకిళ్లపై నిరంతరం గస్తీ తిరగనున్నారు. సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసు సిబ్బంది జనం మధ్యలో తిరుగుతూ, ప్రజలకు రక్షణ అందించనున్నారు. నూతన సంవత్సర వేడుకల్లో రాజకీయ పార్టీలు, సంస్థలు అనుమతి లేకుండా ప్రదర్శనలు నిర్వహించకూడదనే నిబంధన విధించారు. ఇండియా గేట్, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించడానికి ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు విస్తృతమైన తనిఖీలు చేపట్టనున్నారు. ఇండియా గేట్ వద్ద పార్కింగ్ స్థలం పరిమితంగా ఉన్నందున సందర్శకులు ప్రజా రవాణాను ఉపయోగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. మద్యం తాగి వాహనం నడిపినా, అతివేగంగా వాహనం నడిపినా, జిగ్-జాగ్ తరహాలో ప్రమాదకరమైన డ్రైవింగ్ చేసినా వారిపై వివిధ సెక్షన్ల కింద జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశాలున్నాయి.

# జనవరి ఒకటి.. ప్రపంచ జనాభా 809 కోట్లు.. టాప్‌లో భారత్



మనమంతా మరికొద్ది గంటల్లో నూతన సంవత్సరం-2025లోకి అడుగుపెట్టబోతున్నాం. ఇంతలో అమెరికా జనాభా బ్యూరో ఒక ఆసక్తిక నివేదికను వెలువరించింది. 2025 నూతన సంవత్సరం తొలిరోజునాటికి ప్రపంచ జనాభా 809 కోట్లకు చేరుకుంటుందని, దీనిలో భారతదేశం అగ్రస్థానంలో ఉంటుందని తెలియజేసింది. 2024 చివరి నాటికి ప్రపంచ జనాభా 7.1 కోట్లు పెరిగిందని, కొత్త సంవత్సరం నాటికి 809 కోట్లకు చేరుకుంటుందని తాజాగా అమెరికా జనాభా బ్యూరో నివేదిక అంచనా వేసింది. 2023నాటి జనాభాతో పోలిస్తే 2024లో జనాభా పెరుగుదల స్వల్పంగా తగ్గడంతోపాటు 0.9 శాతంగా నమోదైంది. 2025 విషయానికొస్తే జనవరిలో ప్రపంచ జనాభా మరో 7.5 కోట్లు పెరుగుతుందని, ప్రపంచంలో ప్రతి సెకనుకు 4.2 జననాలు, 2.0 మరణాలు నమోదవుతాయని ఈ నివేదిక అంచనా వేసింది. 2024లో అమెరికా జనాభా 26 లక్షల మేరకు పెరిగింది. 2025 నాటికి అమెరికా జనాభా 34.1 కోట్లకు చేరుతుందని బ్యూరో అంచనాలున్నాయి. నూతన సంవత్సరం జనవరిలో అమెరికాలో ప్రతి తొమ్మిది సెకండ్లకు ఒక జననం, ప్రతి 9.4 సెకండ్లకు ఒక మరణం ఉంటుందనే అంచనాలున్నాయి. 2020 దశకంలో అమెరికా జనాభా దాదాపు 97 లక్షల మేరకు పెరిగింది. ఈ పెరుగుదల రేటు 2.9 శాతంగా ఉంది. 2010 దశకంలో అగ్రరాజ్యం జనాభా పెరుగుదల 7.4 శాతం ఉంది. 2024లో భారతదేశ జనాభా 144.17 కోట్లు. 2025 భారత జనాభా అన్ని దేశాలను మించి టాప్‌లో ఉండే అవకాశాలున్నాయని అమెరికా జనాభా బ్యూరో అంచనా వేసింది.

# ఏకంగా 73 దేశాల్లో ఎన్నికలు

## ప్రపంచం ఓటేసింది.. ఓటేసిన 173 కోట్ల మంది ప్రభుత్వాలకు, అధినేతలకు షాక్ పలు దేశాల్లో ప్రహసనప్రాయం



అత్యధిక దేశాల్లో ఎన్నికలు జరిగిన సంవత్సరంగా 2024 చరిత్రలో నిలిచిపోనుంది. అమెరికా నుంచి భారత్ దాకా ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 73 దేశాలు ఓట్ల పండుగ జరుపుకోవడం విశేషం. 27 సభ్య దేశాలున్న యూరోపియన్ యూనియన్‌కు జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు వీటికి అదనం! ఈ దేశాల్లో దాదాపు 400 కోట్ల పై చిలుకు జనాభా ఉంది. అంటే ప్రపంచ జనాభాలో దాదాపుగా సగం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ఏడాది ఎన్నికల క్రతువులో పాల్గొన్నారు. వీటిలో చాలా ఎన్నికలు ఓటర్ల పరిణతికి అద్దం పట్టాయి. ఒక్కో దేశంలో ఒక్కోలా ప్రజలు తీర్పు వెలువరించడం విశేషం. పలు ఫలితాలు ఊహించినట్టు రాగా కొన్ని మాత్రం అనూహ్యలతో ఆశ్చర్యపరిచాయి. అధికార పార్టీల అక్రమాల నడుమ ఎన్నికల ప్రక్రియనే అపహస్యం చేసినవీ ఉన్నాయి...

భారత ఓటర్ల పరిణతి

భారత్‌లో సాధారణ ఎన్నికలు ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామిక క్రతువుగా ఎప్పుడో రికార్డు సృష్టించాయి. ఇంతటి బృహత్తర కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ లేకుండా ప్రశాంతంగా జరిగే తీరు చూసి ప్రపంచమంతా ఎప్పటికప్పుడు ఆశ్చర్యపోతూనే ఉంటుంది. ఈసారి కూడా అందుకు తగ్గట్టే ఏప్రిల్ నుంచి ఆరు వారాల వ్యవధిలో ఏడు విడతల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 64.64 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. ఈసారి ఏకంగా '400కు మించి'అన్న బీజేపీ చివరికి మెజారిటీకీ కాస్త తక్కువగా 240 లోక్‌సభ స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అలా ఈసారి ఫలితాలు కూడా అందరినీ ఆశ్చర్యపరచడమే గాక భారత ఓటర్ల పరిణతికి అద్దం పట్టాయి.

ట్రంప్.. తగ్గేదేలే...!

నానారకాల వాదాలతో విడిపోయిన అమెరికాలో ఈసారి జరిగిన అధ్యక్ష ఎన్నికలు ప్రపంచమంతటినీ అమితంగా ఆకర్షించాయి. డొనాల్డ్ ట్రంప్ హవాకు అద్దం పట్టిన ఎన్నికలుగా నిలిచిపోయాయి. రిపబ్లికన్ల అభ్యర్థిత్వం సాధించడం మొదలుకుని ప్రధాన పోరు దాకా ఆద్యంతం ఆయన కనబరిచిన దూకుడు ఓటర్లను అమితంగా ఆకర్షించింది. ఆయన 'అమెరికా ఫస్ట్'నినాదం రెండోసారి ప్రపంచంలోకెల్లా అత్యంత శక్తిమంతమైన అధికార పీఠం ఎక్కించింది. డెమొక్రాట్లకు అధ్యక్షుడు జో బైడెనే భారంగా మారారు. సకాలంలో తప్పుకోకపోవడం ద్వారా పార్టీ విజయావకాశాలకు తీవ్రంగా గండి కొట్టిన అప్రతిష్టను మూటగట్టుకున్నారు. భారత మూలాలున్న వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ శాయశక్తులా ప్రయత్నించినా, ఆమెదే పైచేయి అని ప్రధాన మీడియా ఎంతగా హొరెత్తించినా ట్రంప్ 'తగ్గేదే లే'అన్నారు. 538 ఎలక్టోరల్ ఓట్లలో ఏకంగా 312 ఓట్లను ఒడిసిపట్టి భారీ మెజారిటీతో విజయ దరహాసం చేశారు.

రిషికి ఓటమి

సమస్యలతో సతమతమవుతున్న బ్రిటన్ ప్రజలు తమ ఆగ్రహమంతటినీ అధికార కన్జర్వేటివ్ పార్టీపై చూపించారు. ఆ పార్టీ 14 ఏళ్ల ఏలుబడికి తెర దించారు. భారత మూలాలున్న తొలి బ్రిటన్ ప్రధానిగా చరిత్ర సృష్టించిన రిషి సునాక్ సారథ్యంలో కన్జర్వేటివ్‌లు దారుణ ఓటమి మూటగట్టుకున్నారు. లేబర్ పార్టీ నేత కియర్‌స్టార్మర్‌కు జనం పట్టం కట్టారు.

పాక్‌లో ప్రహసనం

పాకిస్తాన్‌లో ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికలు అత్యంత వివాదాస్పదంగా నిలిచాయి. ప్రధాని షహబాజ్ షరీఫ్ కుటుంబ పార్టీ పాకిస్తాన్ ముస్లిం లీగ్ నవాజ్ (పీఎంఎల్-ఎన్) ఆద్యంతం ఎన్నికల అక్రమాలకు పాల్పడిందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్ని చేసినా జైలుపాలైన ఇమ్రాన్‌ఖాన్ ఆధ్వర్యంలోని పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ)ను అడ్డుకోలేకపోయింది. పీటీఐ గుర్తింపునే రద్దు చేసినా స్వతంత్రులుగానే నిలబడి అన్ని పార్టీల కంటే ఎక్కువ సీట్లు నెగ్గి సత్తా చాటారు. దాంతో నానా పార్టీలను కలుపుకుని షహబాజ్ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

లంకలో నవోదయం : కల్లోల శ్రీలంకలో సుదీర్ఘ వాయిదాల తర్వాత ఎట్టకేలకు నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో వామపక్షవాది అనూర కుమార దిస్సనాయకే సాధించిన విజయం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దేశ దుస్థితికి ప్రధాన కారకులని భావించిన రాజపక్స కుటుంబాన్ని జనం రాజకీయంగా సమాధి చేశారు.

పుతిన్ ఐదోసారి

చెప్పుకోదగ్గ ప్రత్యర్థే లేకుండా జరిగిన ఎన్నికల్లో రష్యాలో పుతిన్ రికార్డు స్థాయిలో ఐదోసారి అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గారు. అది కూడా ఏకంగా 87 శాతం ఓట్లు సాధించారు. సోవియట్ అనంతర కాలంలో రష్యాలో ఇదే అత్యధిక మెజారిటీ. పుతిన్‌కు ప్రధాన అడ్డంకిగా మారడం ఖాయమని భావించిన విపక్ష నేత అలెక్సీ నావల్నీ ఎన్నికలకు ముందు జైల్లో అనుమానాస్పద స్థితిలో మరణించడం పెను దుమారమే రేపింది. వెనెజువెలాలో అధ్యక్షుడు నికొలస్ మదురో విజయమూ వివాదాస్పదమైంది.

పారిపోయిన నేతలు

పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో అనూ హ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. అది కూడా జనవరిలో సాధారణ ఎన్నికలు ముగిసి షేక్ హసీనా రికార్డు స్థాయిలో ఐదోసారి ప్రధాని కావడం ద్వారా అధికారాన్ని నిలబెట్టుకున్న ఐదు నెలలకే! అజ్ఞాత శక్తి కనుసన్నల్లో సాగినట్టు కన్పించిన 'ప్రజా ఉద్యమం'దెబ్బకు ఆమె పదవీచ్యుతురాలయ్యారు. అధికార నివాసాన్ని ఆందోళనకారులు చుట్టుముట్టడంతో దాదాపుగా కట్టుబట్టలతో ఉన్నపళంగా దేశం వీడి భారత్‌లో రాజకీయ ఆశ్రయం పొందారు. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనుస్ సారథ్యంలోని తాత్కాలిక సర్కా రు కొలువుదీరింది. నాడు మొదలైన అల్లర్లు, అరాచకాలు బంగ్లాలో నేటికీ కొనసాగుతున్నా యి. హిందువులతో పాటు మైనారిటీల భద్రతను ప్రమాదంలో పడేశాయి.

అసద్‌లకు అల్విదా

సిరియాలో అసద్‌ల 50 ఏళ్ల కుటుంబ పాలనకు తిరుగుబాటుదారులు డిసెంబర్‌లో తెర దించారు. అధ్యక్షుడు బషర్ అల్ అసద్ కుటుంబంతో పాటు రష్యాకు పారిపోయారు. అలా నియంతృత్వ పాలనకు తెర పడ్డా దేశం మాత్రం అనిశ్చితితో కూరుకుపోయింది.

# కొత్త టెక్నాలజీతో 10 లక్షల ఉద్యోగాలు

## క్వెస్ ఐటీ స్టాఫింగ్ నివేదిక

న్యూఢిల్లీ: క్వాంటమ్ కంప్యూటింగ్, జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో 2030 నాటికి 10 లక్షల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని ఐటీ ప్లేస్‌మెంట్, స్టాఫింగ్ కంపెనీ క్వెస్ ఐటీ స్టాఫింగ్ నివేదిక వెల్లడించింది. ఏఐ, మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, బ్లాక్‌చెయిన్ విభాగాలలోని నైపుణ్యాలు వినూత్న అప్లికేషన్‌లతో పరిశ్రమలను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాయని తెలిపింది. క్వెస్ టెక్నాలజీ స్కిల్స్ రిపోర్ట్-2024 ప్రకారం.. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ కూడా 2030 నాటికి భారత ఆర్థిక వ్యవస్థకు 150 బిలియన్ డాలర్లకు పైగా దోహదపడతాయని అంచనా. ఇది సాంకేతిక నైపుణ్యంలో భారత స్థానాన్ని సుస్థిరం చేస్తుంది. ఆరోగ్య సంరక్షణ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, రిటైల్, ఆటోమోటివ్, తయారీలో ఏఐ/ఎంఎల్ సాంకేతికత మోసాన్ని గుర్తించడం, నిర్ధారణ, నాణ్యత నియంత్రణ ద్వారా సామర్థ్యాన్ని పెంచుతుంది' అని వివరించింది.



### అసమాన అవకాశాలను..

'టెక్ నియామకాల్లో 43.5 శాతం వాటాతో బెంగళూరు ప్రథమ స్థానంలో ఉంది. హైదరాబాద్ 13.4 శాతం, పుణే 10 శాతం వాటాతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. భారత సాంకేతికత నిపుణులు టెక్నాలజీలో కొత్త మార్పులు తీసుకొస్తున్నారు. జనరేటివ్ ఏఐ, బ్లాక్‌చెయిన్ వంటి సాంకేతికతల జోరుతో 2030 నాటికి భారత ఐటీ రంగం 20 లక్షల ఉద్యోగాలను జోడించనుంది' అని నివేదిక తెలిపింది. ఏఐ/ఎంఎల్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అత్యాధునిక సాంకేతికతలతో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ వంటి సంప్రదాయ నైపుణ్యాల కలయిక అసమాన అవకాశాలను అందిస్తుందని క్వెస్ ఐటీ స్టాఫింగ్ సీఈవో కపిల్ జోషి తెలిపారు.

## జనవరి 7న డాకింగ్ పరిశోధన : ఇస్రో ఛైర్మన్ సోమనాథ్




సూళ్లూరుపేట (తిరుపతి) : శ్రీహరికోట నుండి సోమవారం రాత్రి విజయవంతంగా ప్రయోగించిన పిఎస్ఎల్వి సి-60 రాకెట్ ద్వారా స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు నిర్దిష్ట కక్షలోకి చేరుకోవడం జరిగిందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ ప్రకటించారు. ఈ సందర్భముగా ప్రయోగం అనంతరం సోమనాథ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ. అంతరిక్షంలో వేరు వేరుగా ఉండే స్పేడెక్స్ జంట ఉపగ్రహాలను ఒకటిగా అనుసంధానం చేసే పరిశోధాత్మక ప్రయోగాన్ని జనవరి 7 వ తేదీన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బెంగుళూరు లోని ఇస్ట్రాక్ సెంటర్ లో డాకింగ్ పరిశోధన నిర్వహిస్తారని ఈ ప్రయోగ విజయం భవిషత్ ఇస్రో ప్రయోగాలకు కీలకంగా మారుతుందని అన్నారు.

## ఫిబ్రవరి 1 నుంచి భూ రిజిస్ట్రేషన్ విలువల పెంపు

### రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్




అమరావతి : రాష్ట్రంలో ఫిబ్రవరి ఒకటి నుంచి భూమి రిజిస్ట్రేషన్ విలువలు పెరుగుతాయని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఏయే ప్రాంతాల్లో ఎంతమేర పెంచాల్సి ఉంటుంది? ఏయే ప్రాంతాల్లో తగ్గించాల్సి ఉంటుందనే అంశాలపై జనవరి 15వ తేదీ కల్లా పూర్తిస్థాయి నివేదిక అందించాలని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అధికారులను మంత్రి ఆదేశించారు. తాడేపల్లిలోని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజి కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి అనగాని మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన విచ్చలవిడి అప్పుల భారం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, ఇదే సందర్భంలో రాష్ట్రానికి రెవెన్యూ కూడా అవసరమని అన్నారు. ఎక్కడెక్కడ గ్రోత్ కారిడార్లు ఉన్నాయో, ఎక్కడ భూమి రేట్లు బాగా పెరిగాయో అక్కడ మాత్రమే రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతామన్నారు. గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువల పెంపును ఇష్టానుసారంగా చేసుకుంటూ వెళ్లిందని, ఫలితంగా చాలాచోట్ల భూమి విలువల కంటే రిజిస్ట్రేషన్ విలువలు అధికంగా ఉన్నట్లు తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. అటువంటి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు తగ్గిస్తామన్నారు. గతేడాదితో పోల్చితే గత ఆరు నెలల్లో ఒక్క సెప్టెంబరు నెలలో తప్ప మిగిలిన అన్ని నెలల్లోనూ అదనపు ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి తాము టార్గెట్‌గా పెట్టుకున్న రూ.9,500 కోట్ల లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. భూ వివాదాలను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఇప్పటికి 1.70 లక్షల ఫిర్యాదులు రాగా, అందులో 11 వేల ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించినట్లు మంత్రి తెలిపారు. మీడియా సమావేశంలో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజి శేషగిరిబాబు పాల్గొన్నారు.

## బిజెపి పాలిత రాష్ట్రాల్లో కుల దురహంకార దాడులు



న్యూఢిల్లీ : బిజెపి పాలిత రాష్ట్రాలైన హర్యానా, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో దళితులు, ఆదివాసీలపై కుల దురహంకార దాడులు పెరిగిపోయాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున కర్గే తీవ్రస్థాయిలో విమర్శించారు. 'ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించారు. అదేవిధంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా అట్టడుగు వర్గాల వారిని అణగదొక్కాలనే మనస్తత్వంతోనే వారిపై దాడులు జరుగుతున్నాయి' అని ఖర్గే మంగళవారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. మోడీ రాజ్యాంగ వ్యతిరేక పాలనలో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలపై దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయి. నిరుపేదలు మనువాదుల కష్టాల్ని భరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దేశంలో ప్రతి గంటకు దళిత - ఆదివాసి మహిళలపైనా, పిల్లలపైనా నేరాలు జరుగుతున్నాయని ఎన్‌సిఆర్‌బి లెక్కలే చెబుతున్నాయి. ఈ గణాంకాలు 2014 నుండి రెట్టింపు అయ్యాయి. ఇటీవల జరిగిన ఘటనలే వీటికి సాక్ష్యంగా నిలుస్తాయని ఆయన తెలిపారు. 'ఇటీవల మధ్యప్రదేశ్‌లో దేవాస్ అనే దళిత యువకుడు పోలీస్ కస్టడీలో హత్యకు గురయ్యాడు. ఒడిశాలోని బాలాసోర్‌లోని ఓ ఆదివాసీ మహిళను చెట్టుకు కట్టేసి కొట్టారు. హర్యానాలోని భివానీకి చెందిన ఓ దళిత విద్యార్థిని బిఎ పరీక్షకు ఫీజు కట్టలేక ఆత్మహత్యకు పాల్పడింది. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో గర్భిణీ అయిన ఓ ఆదివాసీ మహిళ ఐసియు కోసం 100 కిలోమీటర్లు ప్రయాణించి మృతి చెందింది. ఉత్తరప్రదేశ్‌లో మూడు దళిత కుటుంబాలపై కులదురహంకార దాడులు జరగడంతో వారు వలస వెళ్లారు. అయినా అక్కడ ముజఫర్‌నగర్ పోలీసులు మౌనంగా ఉన్నారు. 140 కోట్ల మంది భారతీయుల రాజ్యాంగ హక్కుల్ని ఉల్లంఘించడాన్ని కాంగ్రెస్ అనుమతించదు. బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్‌ల రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనలపై కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుంది అని' ఖర్గే తన పోస్టులో పేర్కొన్నారు.

## మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించిన బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు



ఢాకా : భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కి బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ నివాళులర్పించారు. మంగళ వారం ఉదయం 11.30 గంటలకు బరిధరాలోని హైకమిషన్ కార్యాలయానికి చేరుకున్న యూనస్‌ను భారత హైకమిషనర్ ప్రణయ్ కుమార్ వర్మ ఆహ్వానించారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి యూనస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైకమిషన్‌లోని సంతాప పుస్తకంలో తన సంతాప సందేశాన్ని రాశారు. భారత్‌ను ప్రపంచ ఆర్థికరంగంలో దిగ్గజ దేశంగా తీర్చిదిద్దడంలో మన్మోహన్ కీలక పాత్ర పోషించారని అన్నారు. అనారోగ్యంతో ఈ నెల 26న మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించిన సంగతి తెలిసిందే.

## ఏం.. తమాషాలు చేస్తున్నారా..
## పట్టాభిపురం పోలీసులపై హైకోర్టు ఆగ్రహం




అమరావతి: గుంటూరు పట్టాభిపురం పోలీసులపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకోవద్దని ఆదేశాలు జారీ చేశాం. అయినా ఎందుకు తలదూరుస్తున్నారు' అంటూ మండిపడింది. మంగళవారం హైకోర్టులో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు సోదరి వజ్ర కుమారి, వసంత ఇంటి వ్యవహార కేసు విచారణ జరిగింది. విచారణ సందర్భంగా హైకోర్టు ఆదేశించినా.. సివిల్ వ్యవహారంలో పట్టాభిపురం పోలీసులు జోక్యం చేసుకుంటున్నారంటూ వజ్రకుమారి, వసంతల తరఫున న్యాయవాది హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తమ వ్యతిరేక వర్గానికి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, తమ ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారని చెప్పారు. అనంతరం, తమ ఆదేశాలను ధిక్కరించిన పట్టాభిపురం పోలీసులపై హైకోర్టు న్యాయమూర్తి పై విధంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఆదేశాలను కచ్చితంగా అమలు అయ్యేటట్లు చూడాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించారు. కోర్టు ఆదేశాల్ని ధిక్కరిస్తే సదరు పోలీసులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది.

# విమానంలో ఏ సీటు భద్రం?



ఆదివారం దక్షిణకొరియాలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో వెనకవైపు సీట్లలో కూర్చున్న ప్రయాణికులు ఇద్దరు ప్రాణాలతో బయటపడినట్లు వార్తలొచ్చాయి. దీంతో విమానంలో ముందువైపు లేదంటే వెనుకవైపు అసలు ఏ నంబర్ సీటులో కూర్చుంటే ప్రమాదం జరిగినా బయటపడొచ్చనే అంశంపై ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చ మొదలైంది. తరచూ విమానప్రయాణాలు చేసే అంతర్జాతీయ ప్రయాణికులు ఈ చర్చలను తీక్షణంగా గమనిస్తున్నట్లు వార్తలొచ్చాయి. నిజంగానే వెనుకవైపు సీట్లు భద్రమా? అనే ప్రశ్న ఇప్పుడు ప్యాసింజర్లను తొలచేస్తోంది.

### మిగతా ప్రయాణాలతో చూస్తే భద్రమే

ఎక్కడ కూర్చుంటే క్షేమంగా ఉంటామనే ప్రశ్న కంటే అసలు విమానంలో ప్రయాణమే అత్యంత భద్రమని మరో వాదన మొదలైంది. నిర్లక్ష్య డ్రైవింగ్, గతుకుల రోడ్డు, ఎత్తుఒంపులు ఉన్న చోట్ల సాంకేతిక ప్రమానాలు పాటించకుండా నిర్మించిన రోడ్లు, సరైన సూచికల వ్యవస్థ లేకపోవడం వంటి ఎన్నో కారణాలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రయాణంతో పోలిస్తే విమాన ప్ర యాణం ఎంతో క్షేమదాయకమని వారు చెబుతున్నారు. విమానంలో ఎక్కడ కూర్చున్నా భద్ర మేనని, ఎప్పటికప్పుడు మొత్తం విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీచేసి సుశిక్షుతులైన పైలట్ల పర్యవేక్షణలో విమానం ప్రయాణిస్తుందని, అ త్యంత అరుదుగా మాత్రమే, అసాధారణ వాతావరణ పరిస్థితుల్లోనే వి మా నం ప్రమాదంబారిన పడుతుంద ని విశ్లేషకులు చెబుతు న్నారు.

### అమెరికాలో ఎలా?

ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం అమెరికా రోడ్లపై ప్రతి 10 కోట్ల వాహన ప్రయాణాల్లో కేవలం 1.18 మరణాలు సంభవిస్తున్నాయి. అదే 10 కోట్ల మైళ్ల రైలు ప్రయాణంలో 0.04 మరణాలు సంభవిస్తున్నాయి. ఇక 10 కోట్ల మైళ్ల విమాన ప్రయాణాల్లో అత్యంత స్వల్పంగా కేవలం 0.003 మరణాలు సంభవిస్తున్నాయి. అంతర్జాతీయ పౌర విమానయాన రంగ గణాంకాల ప్రకారం 2023లో ప్రతి వంద కోట్ల మంది ప్రయాణికులకు కేవలం 17 మంది మాత్రమే విమాన ప్రమాదాల్లో చనిపోయారు. 2022 ఏడాదిలో ఈ సంఖ్య 50గా ఉంది. అత్యాధునిక విమానాల్లో ఆధునిక భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నా అనుకూల వాతావరణ పరిస్థితుల కారణంగానే అత్యల్ప స్థాయిలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

### తోక క్షేమమే

విమానం ద్రవరూప ఇంధనం(ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్)తో నడుస్తుంది. చిన్న జెట్ విమానాలను మినహాయిస్తే అంతర్జాతీయ సర్వీస్‌లకు వాడే భారీ పౌరవిమానాల్లో రెక్కల కింద ఈ ఇంధనాన్ని నిల్వచేస్తారు. ఏదైనా ప్రమాదం జరిగి నిప్పురవ్వలు రాజుకుంటే రెక్కల కింద ఇంధనం భగ్గున మండి రెక్కల సమీప సీట్లలోని ప్రయాణికులు బుగ్గిపాలుకావడం ఖాయం. ఈ కోణంలో చూస్తే రెక్కల సమీపంలోని సీట్లు ప్రమాదసందర్భాల్లో అంత క్షేమదాయకం కాదని గత ప్రమాదరికార్డులు తేటతెల్లంచేస్తున్నాయి. ఈ విషయమై అమెరికాలో పాపులర్ మెకానిక్స్ అనే మేగజైన్ 1971 నుంచి 2005 వరకు జరిగిన విమాన ప్రమాదాలను విశ్లేస్తూ ఒక నివేదిక సిద్ధంచేసింది. దీని ప్రకారం తోకభాగంలో కూర్చుంటే ప్రమాదాల్లో బతికే అవకాశాలు మిగతా సీట్లతో పోలిస్తే 40 శాతం అధికంగా ఉంటాయి.

### ముందు సీట్లతో ముప్పే

ప్రమాదంలో ఇంధనం అంటుకుని మంటలు చుట్టుముట్టకపోయినా ముందు సీట్లు ఒకరకంగా ప్రమాదకరమని నివేదించారు. ఎదురుగా ఏదైనా కొండను ఢీకొట్టినా, నేలపై కుప్పకూలినా, వేరే విమానాన్ని ఢీకొట్టినా, రన్‌వే చివరన గోడలాంటి నిర్మాణాన్ని ఢీకొట్టినా, రన్‌వే దాటి లోయ లేదంటే సముద్రం, సరస్సు వంటి జలాశయంలోకి దూసుకెళ్లినా ప్రమాద ప్రభావం ముందు సీట్లపైనే అధికంగా ఉంటుంది.

### మధ్య సీట్ల పరిస్థితి విచిత్రం

మధ్య సీట్లలో కూర్చుంటే రెక్కలకు సమీపంలో ఉండటం వల్ల ఇంధనంలో మంటలొస్తే ప్రమాదమే. కానీ మంటలు చెలరేగని పక్షంలో ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గం వీళ్లకే దగ్గరగా ఉంటుంది. తప్పించుకునే అవకాశాలు వీళ్లకే ఎక్కువ. ఏదేమైనా విమానం ప్రమాదంలో పడిన తీరు, వేగం, దిశను బట్టి విమానంలోని ముందు, వెనుక, పక్క భాగాలు దెబ్బతింటాయి. భారత్‌లో గంటకొకటి చొప్పున జరిగే రోడ్డు ప్రమాదాలు, ఇటీవల సర్వసాధారణమైన పట్టాలు తప్పడం వంటి రైలు ప్రమాదాలతో పోలిస్తే అత్యంత అరుదుగా జరిగే విమాన ప్రమాదాలను భూతద్దంలో చూడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చే వాళ్లు ఈ 'సీటు క్షేమం'చర్చలో పాల్గొన్నారు.

### బతికే అవకాశాలు 60 శాతం

అమెరికా జాతీయ రవాణా భద్రతా బోర్డ్ నివేదికను విశ్లేస్తూ బ్రిటన్ పాత్రికేయుడు మ్యాక్స్ ఫాస్టర్ తాజాగా ఒక విషయాన్ని బయటపెట్టారు. "విమానం నేలపై కూలినా, నీటిలో పడినా, గాల్లోనే పేలిపోయినా ముందు సీట్లలో కూర్చునే ప్రయాణికులు 49 శాతం వరకు బతికే అవకాశాలు ఉన్నాయి. రెండు రెక్కల మధ్యభాగంలోని సీట్లలో కూర్చుంటే 59 శాతం వరకు బతికే అవకాశాలు ఉన్నాయి. ఇక వెనుకవైపు అంటే తోక సమీప సీట్లలో కూర్చుంటే 69 శాతం బతికే అవకాశాలు ఉన్నాయి"అని అన్నారు. అయితే ఇక్కడో ఘటనను తప్పక గుర్తుచేసుకోవాలని ఆయన చెబుతున్నారు. '1989లో అమెరికాలో యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానం ప్రమాదానికి గురైనప్పుడు 269 మంది ప్రయాణికుల్లో 184 మంది బతికారు. వీరిలో చాలా మంది ముందు సీట్లలో కూర్చున్నారు"అని ఆయన గుర్తుచేశారు. ప్రఖ్యాత 'టైమ్'మేగజైన్ నివేదిక సైతం వెనుక సీట్లు క్షేమమని తెలిపింది. మిగతా సీట్లతో పోలిస్తే వెనుకవైపు సీట్లలో మధ్య వాటిల్లో కూర్చుంటే మరింత క్షేమమని పేర్కొంది. ఇక్కడ కూర్చుంటే మరణించే అవకాశం కేవలం 28 శాతమని, అదే విమానం మధ్యలో కూర్చుంటే ముప్పు శాతం 44 శాతంగా ఉంటుందని వెల్లడించింది.

# స్ఫూర్తిదాయక విజయాలు




చదరంగంలో భారత దేశానికి ఇది స్వర్ణయుగం. న్యూయార్క్‌లో జరుగుతున్న 'ఫిడే'ఉమెన్స్ వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్ పోటీల్లో భారత క్రీడాకారిణి కోనేరు హంపీ ఆదివారం సాధించిన ఘన విజయం అందుకు మరో తాజా నిదర్శనం. న్యూయార్క్‌లో మొత్తం 110 మంది పాల్గొన్న ర్యాపిడ్ చెస్ టోర్నీలో 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి, ఛాంపియన్ అయ్యారు. అంతకు ముందు సింగపూర్‌లో క్లాసికల్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో గుకేశ్ విజయం, అంతకన్నా ముందు ఈ ఏడాది సెప్టెంబర్‌లో బుడాపెస్ట్‌లోని చెస్ ఒలింపియాడ్‌లో ఓపెన్, ఉమెన్స్ కేటగిరీలు రెంటిలోనూ కనివిని ఎరుగని రీతిలో భారత్ రెండు స్వర్ణాలు సాధించడం... ఇవన్నీ ఈ 2024ను భారత చదరంగానికి చిరస్మరణీయ వత్సరంగా నిలిపాయి. మంగళవారం నుంచి జరగనున్న 'ఫిడే' వరల్డ్ బ్లిట్జ్ ఛాంపి యన్‌షిప్ పైనా కన్నేసి, గ్రాండ్‌డబుల్ సాధించాలని హంపీ అడుగులేస్తుండడం విశేషం. గతంలో 2019లో జార్జియాలో తొలిసారి మహిళల వరల్డ్ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్ గెలిచిన కోనేరు హంపీకి తాజా విజయం రెండో ప్రపంచ టైటిల్. చైనాకు చెందిన జూ వెన్‌జున్ తర్వాత ఈ టైటిల్‌ను ఒకటికి రెండుసార్లు గెలిచింది హంపీయే! నిరుడు పెళ్ళి తరువాత మాతృత్వం కోసం కొన్నాళ్ళు ఆటకు దూరం జరిగిన హంపీ 2018లో చదరంగపు పోటీలకు తిరిగి వచ్చాక కూడా తన హవా కొనసాగిస్తూ వచ్చారు. 2019లో టైటిల్ సాధించారు. గత ఏడాది కూడా ఆమె గెలవాల్సింది. టై బ్రేక్‌లో త్రుటిలో ప్రపంచ టైటిల్‌ను కోల్పోయారు. అయితేనేం, పట్టుదలతో కృషిని కొనసాగించి మళ్ళీ ఇప్పుడు ఆటలో కిరీటం గెల్చుకొని, తనలో సత్తా చెక్కుచెదరలేదని నిరూపించారు. సామాన్యులతో పాటు ఆటలోని వర్ధిష్ణువులకు సైతం ఇది స్ఫూర్తి మంత్రం. నిజానికి, ఈ భారత నంబర్ 1 చదరంగ క్రీడాకారిణే అన్నట్టు, కచ్చితంగా సరికొత్త టైటిల్ విజయం మన దేశంలోని యువతరాన్ని చదరంగ క్రీడ వైపు మరింతగా ఆకర్షిస్తుంది. అదే సమయంలో పలువురు చెస్ ప్రొఫెషనల్స్‌గా తయారవడానికి ప్రేరణ కూడా అవుతుంది. ఫస్ట్ రౌండ్‌లో ఓటమి పాలైనా, 11వ, ఆఖరి రౌండ్‌లో గెలవడంతో 8.5 పాయింట్లతో పట్టికలో హంపీ అగ్రస్థానానికి చేరారు. ఇండోనేసియాకు చెందిన ఇరీన్ సుకందర్‌ను ఓడించి, వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ గెలుపుతో 2024కు ఘనంగా వీడ్కోలు పలికారు. చెస్‌లో ఆరితేరిన గ్రాండ్ మాస్టర్ అయినా బిడ్డకు తల్లి అయ్యాక, ఎన్నో కుటుంబ బాధ్యతలు మీద పడ్డాక, 37 ఏళ్ళ వయసులో హంపీ ఈ అరుదైన విన్యాసం సాధించడం అబ్బురం. అంతేకాదు... అభినందించాల్సిన అంశం. వయసు, బాధ్యతలు మీద పడుతున్నప్పటికీ పట్టు వదలకుండా, నిత్య కృషితో ముందుకు సాగడం, ఆటలో అదే నైశిత్యాన్ని ప్రదర్శించడం ఆషామాషీ కాదు. ఈ 2024 అంతా ఆశించిన ఆటతీరు కనబరచలేక, ఆత్మవిశ్వాసం కుంటుబడిన హంపీ ఒక దశలో అసలీ ఛాంపియన్‌షిప్‌లో పోటీ పడకూడదనీ అనుకున్నారట. ఆట నుంచి రిటైరవుతారన్న అనుమానాల నుంచి ఆఖరికి అగ్రపీఠాన్ని అధిష్ఠించే దాకా ఆమె ప్రస్థానం చిరస్మరణీయం. అందుకే, హంపీ గెలిచిన ఈ కొత్త కిరీటం మునుపటి విజయాల కన్నా ఎంతో ప్రత్యేకమైనది. చిన్నారి కూతురును చూసుకోవడంలో ఆమె తల్లితండ్రులు, భర్త పోషించిన పాత్ర మరెందరికో స్ఫూర్తిపాత్రమైనది. అంతర్జాయ యవనికపై భారత క్రీడాకారులు, అందులోనూ తెలుగువాళ్ళు కొన్నాళ్ళుగా సాధి స్తున్న ఘనతలు అనేకం. తాజా ఘటనలే తీసుకుంటే, తెలుగు మూలాలున్న చెన్నై కుర్రాడు గుకేశ్ ఇటీవల ప్రపంచ చదరంగ ఛాంపియన్‌గా అవతరించాడు. అంతకన్నా ముందు ఆ వెంటనే ఇప్పుడు హంపీ ర్యాపిడ్ చెస్‌లో రెండోసారి వరల్డ్ టైటిల్ సాధించారు. మరోపక్క భారత క్రికెట్ జట్టులో విశాఖకు చెందిన 22 ఏళ్ళ నవ యువ ఆటగాడు నితీశ్ రెడ్డి ఆస్ట్రేలియాలో సంచలనం రేపాడు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న 4వ టెస్టులో ప్రతికూల పరిస్థితుల్లో క్రీజులో పాతుకుపోయి, అద్భుత మైన తొలి శతకం సాధించి, జట్టు పరువు నిలిపాడు. విదేశీగడ్డపై తొలి టెస్ట్ సిరీస్ ఆడుతూ, 8వ నంబర్ ఆటగాడిగా బరిలో దిగి సెంచరీ చేసిన తీరు యువతరంలోని క్రీడాకౌశలానికి నిదర్శనం. ఇవన్నీ భారత జాతి, మరీ ముఖ్యంగా మన తెలుగువాళ్ళు గర్వించాల్సిన క్షణాలు. అయితే, ఇవి సరి పోవు. మన 140 కోట్ల జనాభాలో ఇంతకు మించి శక్తి సామర్థ్యాలు, ఇంకా ఎంతో మంది ప్రతిభావంతులు ఉన్నారు. వారినీ సరైన రీతిలో ప్రోత్సహించి, ప్రాథమిక వసతి సౌకర్యాలు అందిస్తే ఇలాంటి విజయాలు అనునిత్యం మన సొంతమవుతాయి. తాజా ఘటనలు అదే రుజువు చేస్తున్నాయి. అయితే, మన దేశంలో ఎవరికి ఎంత ఆసక్తి ఉన్నా క్రీడల్లో కెరీర్‌ను నిర్మించుకోవడం ఇప్పటికీ కష్టసాధ్యంగానే ఉందన్నది నిష్ఠురసత్యం. ఆటల్లో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న పలువురు ఆనక కూలీనాలీ చేసుకుంటూ, కష్టంగా బతుకీడుస్తున్న ఉదంతాలు నేటికీ కళ్ళ ముందుకొస్తూ, కన్నీళ్ళు పెట్టిస్తున్నాయి. ఈ పరిస్థితులను చక్కదిద్ది, క్రీడల మీద ఆసక్తిని పెంచాల్సింది పాలకులు, ప్రభుత్వాలే. ఆ పని చేయకుండా... పతకాలు, టైటిళ్ళ మీదే ధ్యాసతో, ఆటగాళ్ళను నిందించి ప్రయోజనం లేదు. ఇంట్లో తల్లితండ్రులు, పాఠశాలలో అధ్యాపకుల స్థాయి నుంచి అందుకు తగ్గట్టు వాతావరణం కల్పించడం ముఖ్యం. అదే సమయంలో క్రీడా సంఘాలు, ప్రభుత్వ ప్రాధికార సంస్థల లాంటి వాటిని రాజకీయాలకు అతీతంగా నడపడం అంతకన్నా ముఖ్యం. అప్పుడే క్రీడాకారుల కలలు ఫలిస్తాయి. క్రీడాభిమాన లోకం ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయి. ఒలింపిక్స్‌కు సైతం ఆతిథ్య మివ్వాలని ఆశపడుతున్న మన పాలకులు అంత కన్నా ముందు సరిదిద్దుకోవాల్సిన అంశాలపై దృష్టి పెట్టడం అవసరం.

## అంతరిక్షంలోకి 2 స్పేడేక్స్ ఉపగ్రహాలు
## పీఎస్ఎల్వీ సీ-60 ప్రయోగం విజయవంతం

శ్రీహరికోట: రెండు ఉపగ్రహాలు, 24 పేలోడ్లతో పీఎస్ఎల్వీ సీ-60ః విజయవంతంగా నింగికెగిసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి బహుళ ప్రయోజనాల రాకెట్ సోమవారం రాత్రి 10 గంటల 15 సెకండ్లకు నింగిలోకి దూసుకెళ్లింది. ఒక్కొక్కటి 220 కిలోల బరువున్న స్పేడెక్స్ ఉపగ్రహాలను భూమికి 476 కిలోమీటర్ల అంతరిక్ష కక్ష్యలోకి



శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టారు. మొదట స్పేడెక్స్-బి ఉపగ్రహం, అనంతరం మరో మూడు సెకండ్ల వ్యవధిలో స్పేడెక్స్-ఎ ఉపగ్రహం రాకెట్ నుంచి విడిపోయాయి. రెండు స్పేడెక్స్ ఉపగ్రహాలు విడిపోయిన తర్వాత 15 నిమిషాల 13 సెంకడ్లకు కక్ష్యను మార్చుకున్నాయి. సుదీర్ఘ సమయం అనంతరం రెండుసార్లు ఆర్బిట్ మార్పులో నాలుగో దశ అంటుకోవడం, మళ్లీ కట్ ఆఫ్, మళ్లీ స్టార్ట్, మళ్లీ కట్ ఆఫ్‌లతో నాలుగో దశలో భూమికి దగ్గరగా ప్రవేశించాయి ఈ తరుణంలో రాకెట్ శీర్ష భాగంలో అమర్చిన 24 పేలోడ్లు అక్కడక్కడా విసిరివేయబడ్డాయి. ఈ పేలోడ్లు భూమికి దగ్గర కక్ష్యలోకి చేరి రాకెట్ ప్రయోగం పూర్తి కావడానికి 95 నిమిషాలు సమయం పట్టింది. ఈ ప్రయోగంలో అత్యంత ముఖ్యమైన స్పేడెక్స్ ఉపగ్రహాలు

# నిప్పులు చిమ్ముతూ నింగిలోకి



కక్ష్యలో చేరిన వెంటనే ఈ ప్రయోగం విజయవంతమైనట్టు శాస్త్రవేత్తలు ప్రకటించారు.

### స్ట్రాపాన్ బూస్టర్లు లేని ప్రయోగం

ఉపగ్రహాల బరువు తక్కువగా ఉన్న కారణంగా పీఎస్ఎల్వీ సీ-60 స్ట్రాపాన్ బూస్టర్లు లేకుండా రూపొందించారు. ప్రయోగ సమయంలో 44.5 మీటర్ల ఎత్తు, 229 టన్నుల బరువు కలిగిన నాలుగు దశల పీఎస్ఎల్వీ రాకెట్ రెండు, నాలుగవ దశలు ద్రవ ఇంధనంతోనూ, ఒకటి, మూడవ దశల్లో ఘన ఇంధనంతో నడిచాయి. పీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 62వ రాకెట్. ఈ సిరీస్‌లో ఇప్పటికే ఎన్నో ప్రయోగాలు జరిగినప్పటికీ ఏదో ఒక కొత్తదనాన్ని ప్రతిసారీ శాస్త్రవేత్తలు ఆవిష్కరిస్తూనే ఉన్నారు. ఈసారి స్పేడేక్స్ ఉపగ్రహాలతో అంతరిక్షంలో సరికొత్త విన్యాసాలకు నాంది పలికారు. రెండు ఆర్బిట్లలో ప్రవేశించే ఉపగ్రహాలు క్రమేణ దగ్గరై ఒకేచోట అనుసంధానమయ్యే ప్రక్రియ ఇస్రోకు కొత్త. ఈ విధంగా అంతరిక్షంలోకి చేరిన ఉపగ్రహాలు ఒక్కచోట చేరితే భవిష్యత్తులో స్పేస్ స్టేషన్ నిర్మాణానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు. అంతరిక్షంలో ఇస్రో స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేసుకున్న తర్వాత మన ప్రయోజనాల కోసం ఉపయోగించే ఉపగ్రహాలన్నీ ఒక సమూహంగా చేరి విలువైన సమాచారం సేకరించి భూమికి అందిస్తాయి. ఈ స్పేడేక్స్ ఉపగ్రహాల తయారీలో ఇస్రో శాస్త్రవేత్తలు అత్యంత శక్తివంతమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అమర్చారు. బెంగళూరు యుఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈ రెండు ఉపగ్రహాలను రూపొందించారు.

## రైతునేత దల్లేవాల్‌ను ఆస్పత్రికి తరలించే పిటిషన్‌పై విచారణ వాయిదా



చండీగఢ్ : రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్‌ను ఆస్పత్రికి తరలించడంపై విచారణను మంగళవారం సుప్రీంకోర్టు జనవరి 2కి వాయిదా వేసింది. రైతుల డిమాండ్ల కోసం జగ్జీత్ సింగ్ నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. సోమవారానికి ఆయన దీక్ష 35వ రోజుకి చేరుకుంది. ఈ క్రమంలో దల్లేవాల్‌కు అందిస్తున్న వైద్య చికిత్సకు సంబంధించి పంజాబ్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను సుప్రీంకోర్టు మంగళవారం సమీక్షించాల్సివుంది. అయితే, డిసెంబర్ 20న కోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించేందుకు మరో మూడు రోజుల సమయం జారీ చేయాల్సిందిగా పంజాబ్ తరపు అడ్వకేట్ జనరల్ గుర్మీందర్‌సింగ్ కోర్టును కోరారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సుధాన్షు ధౌలియాలతో కూడిన వెకేషన్ బెంచ్ ఈ అంశంపై విచారణను జనవరి 2కి వాయిదా వేసింది. నిరసన చేపడుతున్న రైతులతో ఓ అధికారుల బృందం చర్చలు జరుపుతోందని, దల్లేవాల్‌ను ఆస్పత్రికి తరలించే చర్యలు చేపడుతున్నామని కోర్టుకు తెలిపారు. డిసెంబర్ 29న దల్లేవాల్‌ను చికిత్సకు అంగీకరించేలా ఒప్పించేందుకు ప్రయత్నించింది. అయితే నిరసనస్థలాన్ని ఖాళీ చేసేందుకు దల్లేవాల్ నిరాకరించాడు. రైతుల డిమాండ్లను పరిష్కరించాలని కేంద్రాన్ని కోరుతూ దల్లేవాల్ సోమవారం విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు. ఈ బంద్‌ను విజయవంతం చేయడంలో సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర విభాగం), కిసాన్ మజ్దూర్ మోర్చాల నేతృత్వంలో సోమవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి.

## ఢిల్లీలో పూర్ కేటగిరీలో గాలి నాణ్యతలు



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యతలు పడిపోయాయి. మంగళవారం ఉదయం 8 గంటలకు ఢిల్లీలో 245 వద్ద గాలి నాణ్యతలు (ఎక్యూఐ) నమోదయ్యాయని, ఎక్యూఐని పూర్ కేటగిరీలో వర్గీకరించినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. ఢిల్లీలో దట్టమైన పొగమంచు కురుసింది. దీంతో స్థానికులు చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఈరోజు ఉదయం 8.30 గంటలకు ఢిల్లీలో సగటు 10.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 11 డిగ్రీలు, మధ్య, గరిష్ట ఉష్ణోగ్రత 15 నుండి 18 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండవచ్చునని ఐఎండి అంచనా వేసింది. ఢిల్లీలోని నజాఫ్‌గర్ 9.6 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## కోల్‌కతాలో నకిలీ క్యాన్సర్, షుగర్ మెడిసిన్స్ ..



కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌లో నకిలీ క్యాన్సర్, షుగర్ మెడిసెన్స్‌ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు మంగళవారం ప్రకటించారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ మార్కెట్ విలువ సుమారు రూ.6.60 కోట్లు ఉంటుందని అంచనా. కోల్‌కతాలోని 'కేర్ అండ్ క్యూర్ ఫర్ యు' హెూల్‌సేల్ సంస్థ ప్రాంగణంలో ఇటీవల జరిపిన దాడిలో గుర్తించామని అన్నారు. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ), డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టరేట్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఈస్ట్ జోన్ డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్ ఓ మహిళను అదుపులోకి తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. మెడిసెన్స్ నాణ్యతా ప్రమాణాలను గుర్తించేందుకు లేబరేటరీకి పంపామని అన్నారు. పెద్ద మొత్తంలో యాంటీ క్యాన్సర్, యాంటీ షుగర్, ఇతర మందులు ఉన్నాయని అన్నారు. ఐర్లాండ్, టర్కీ, యుఎస్ఎ, బంగ్లాదేశ్‌తో సహా వివిధ దేశాల లేబుల్స్‌తో తయారవుతున్న ఈ మందులు భారత్‌లోకి దిగుమతి అయినట్లుగా ఎటువంటి పత్రాలు లేవని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

## అత్యంత సంపన్న సిఎం చంద్రబాబు



న్యూఢిల్లీ : దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ సిఎం ఎన్ చంద్రబాబు నాయుడు నిలిచారు. ఆయన ఆస్తుల విలువ రూ.931 కోట్లు. ఈ వివరాలను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) సోమవారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. దేశంలో రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రుల సగటు ఆస్తి రూ.52.59 కోట్లుగా నివేదిక పేర్కొంది. దేశంలో మొత్తం 31 మంది ముఖ్యమంత్రుల మొత్తం ఆస్తుల విలువ రూ.1,630 కోట్లుగా నివేదిక తెలిపింది.దేశంలో 2023-24లో తలసరి నికర జాతీయ ఆదాయం (ఎన్ఎన్ఐ) రూ.1,85,854 కాగా, ఇదే ఏడాదిలో ముఖ్యమంత్రుల సగటు ఆదాయం రూ. 13,64,310గా నివేదిక పేర్కొంది. ఇది ఎన్ఎన్ఐ కంటే 7.3 రెట్లు ఎక్కువ అని తెలిపింది. ధనిక ముఖ్యమంత్రుల్లో 2, 3 స్థానాల్లో అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక సిఎంలు పెమా ఖండూ (రూ.332 కోట్లు), సిద్ధరామయ్య (రూ.51 కోట్లు) ఉన్నారు.

## రేషన్ బియ్యం మాయం కేసు - పరారీలో మంత్రి పేర్ని నాని



మచిలీపట్నం (కృష్ణా జిల్లా) : మాజీ మంత్రి పేర్ని నాని మళ్లీ పరారయ్యారు. రేషన్ బియ్యం మాయం కేసులో పేర్ని నానిని ఎ6 గా పోలీసులు చూపించారు. తనపై కేసు నమోదు కావటంతో పేర్ని నాని పరారయ్యారు. పేర్ని నాని కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. రేషన్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నానిపై బందరు తాలుకా పీఎస్ లో కేసు నమోదైంది. పేర్ని నానిని ఎ6గా చూపించారు. ఎ1గా పేర్ని నాని భార్య జయసుధ, ఎ2గా గోడౌన్ మేనేజర్ మానసతేజ, ఎ3గా సివిల్ సప్లయిస్ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి, ఎ4గా లారీ డ్రైవర్ బోట్ల నాగ మంగారావు, ఎ5గా రైస్ మిల్లర్ బర్రా ఆంజనేయులును చూపించారు. ఈ కేసులో ఎ1 పేర్ని జయసుధకు ముందస్తు బెయిల్ మంజూరు కాగా ఎ2, ఎ3, ఎ4, ఎ5లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు. ఎ6గా ఉన్న పేర్ని నాని కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిన్న రాత్రి వరకు మచిలీపట్నంలోని తన ఇంట్లోనే ఉన్న పేర్ని నాని ఎ6గా తనపై కేసు నమోదైనట్టు తెలిసిన వెంటనే పరారైనట్టు సమాచారం. ఈ కేసుకు సంబంధించి పేర్ని నాని ముందుగానే ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోరుతూ లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.

# గుదిబండగా మెట్రోలు!

### ఖర్చు ఎక్కువ..రాబడి తక్కువ
### తగ్గిపోతున్న ప్రయాణికుల డిమాండ్
### దూర ప్రయాణాలకే పరిమితం
### చౌకైన ప్రజా రవాణా వ్యవస్థ ఉండాలంటున్న నిపుణులు



న్యూఢిల్లీ: పేదలు, సామాన్య ప్రజల ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రధాన నగరాల్లో మెట్రో రైళ్లను పరుగులు పెట్టించేందుకు కృతనిశ్చయంతో ఉంది. యాభై నగరాల్లో మెట్రోలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోడీ 2016లో పూనే మెట్రోకు భూమిపూజ చేసిన సందర్భంగా ప్రకటించారు. రాబోయే పాతిక ముప్పై సంవత్సరాల కాలంలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. మెట్రో రైలు నడిపిన వెంటనే లాభాలు రావని, కానీ అవి నడవడం మొదలు పెట్టిన 2-4 సంవత్సరాల్లో లాభాల బాట పడతాయని కూడా చెప్పారు.

### 2014కు ముందు ఆ తర్వాత

2014కు ముందు మెట్రో రైల్ వ్యవస్థ కేవలం ఐదు నగరాలకే కొల్‌కతా, ఢిల్లీ, గుర్‌గావ్, బెంగళూరు, ముంబయి పరిమితమైంది. ఈ నగరాలన్నింటిలో కలిపినా ఆ వ్యవస్థ కేవలం 229 కిలోమీటర్లకే పరిమితమైంది. పది సంవత్సరాలు గడిచిన తర్వాత అంటే ఈ ఏడాదిలో మెట్రో నెట్‌వర్క్ 900 కిలోమీటర్లకు పైగా విస్తరించింది. ప్రస్తుతం 13 ప్రధాన నగరాల్లో (సమీపంలోని శాటిలైట్ నగరాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య 20 దాటుతుంది) మెట్రోలు పరుగులు తీస్తున్నాయి. ఇప్పుడు నిర్మాణంలో ఉన్న లేదా అనుమతి పొందిన లేదా సుమారు పాతిక నగరాల్లో ప్రతిపాదనలు సిద్ధమైన దశల్లో మరో వెయ్యి కిలోమీటర్ల మెట్రో ట్రాక్ ఉంది. అయితే ఇంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్న వారి సంఖ్య మాత్రం నిరాశాజనకంగా ఉంటోంది.

### దూర ప్రయాణాలకే అనుకూలం

మెట్రో రైళ్లు ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉంటాయి. పర్యావరణహితమైనవి. అయినప్పటికీ ప్రయాణికులను ఆకర్షించడంలో సబర్బన్ మెట్రో రైళ్లు విఫలమవుతున్నాయి. దానికి కారణం పట్టణ ప్రాంత వాసుల్లో అనేక మందికి మెట్రోల అవసరం లేకపోవడమే. ప్రయాణ దూరం తక్కువగా ఉన్న చోట మెట్రో అవసరం పెద్దగా ఉండడం లేదు. మన దేశంలో ఈ దూరం చాలా చోట్ల తక్కువగానే ఉంటోంది. తమ ఇంటికి సమీపంలో అందుబాటులో ఉన్న ప్రయాణ సౌకర్యాల వైపే ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతారు. 'భారతీయ నగరాల్లో జనాభా ఎక్కువ. కాబట్టి ప్రజలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. ప్రజలు అధిక సంఖ్యలో మెట్రోలను ఉపయోగిస్తారని అనుకోవడం అవాస్తవం' అని ఢిల్లీలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చైర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గీతం తివారీ చెప్పారు. దూర ప్రాంత ప్రయాణాలకు మెట్రో తరహా వ్యవస్థలు ఆకర్షణీయంగా ఉంటాయని, అయితే లక్నో, జైపూర్, కొచ్చి, తదితర నగరాల్లో సైతం ఆరేడు శాతం మంది కంటే ఎక్కువగా దూర ప్రాంత ప్రయాణాలు చేయడం లేదని ఆయన తెలిపారు.

డిమాండ్ లేక వెలవెల

'ఏదైనా నగరంలో మెట్రో వ్యవస్థను విస్తరించినప్పటికీ అది ఎక్కువ మందికి ఉపయోగపడదు. ఎందుకంటే కొన్ని పెద్ద నగరాల్లో మాత్రమే దూర ప్రయాణాలు ఉంటాయి. కాబట్టి వ్యవస్థను విస్తరించినప్పటికీ ప్రయాణికుల సంఖ్య పెద్దగా పెరిగేదేమీ ఉండదు' అని తివారీ చెప్పారు. రాజధాని ఢిల్లీలోని కొన్ని మెట్రో కారిడార్ల పనితీరు బాగుంది. అయితే చెన్నరు వంటి పెద్ద నగరాల్లో సైతం ముందుగా అంచనా వేసిన డిమాండ్‌లో నాలుగో వంతో లేక ఎనిమిదో వంతో ఉంది. నెలో లేదా రెండు నెలలో డిమాండ్ లేకపోవడం కాదు. మెట్రో సర్వీసులు మొదలై సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా డిమాండ్ తక్కువగానే ఉంటోంది.

### ఖర్చు అధికం ఆదాయం స్వల్పం

2014-2022 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం మెట్రో రైల్ ప్రాజెక్టుల కోసం రూ.90,000 కోట్లు విడుదల చేసింది. వివిధ రాష్ట్రాల్లోని చిన్న చిన్న నగరాలు సైతం మెట్రో రైళ్లు కావాలని కోరుతున్నాయి. దీనికి ప్రధాన కారణం వాటిలో ఉన్న నూతన సాంకేతిక పరిజ్ఞానమే. ఆర్థికంగా లాభదాయకంగా లేకపోయినా రాష్ట్రాలు మెట్రోల వైపే చూస్తున్నాయి. అవి ఉంటే రాష్ట్రానికి గర్వకారణమని భావిస్తున్నాయి. మరోవైపు పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉపయోగించే బస్సుల సంఖ్య తగ్గిపోతోంది. కిలోమీటరు దూరం మెట్రోను నిర్మించాలంటే రూ.500 కోట్లకు పైగానే ఖర్చవుతుంది. ఇంత ఖర్చు చేసినా ఢిల్లీ, మెట్రో వంటి నగరాల్లో ఆ కిలోమీటరు ప్రయాణం రోజూ కేవలం 10,000 నుండి 20,000 వేల మందికి మాత్రమే ఉపయోగపడుతోంది. అదే ఆ ఐదు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే ఐదు వందల నాణ్యమైన మెట్రో వంటి బస్సులు వస్తాయి. అవి రోజూ నాలుగైదు లక్షల మందిని గమ్యస్థానాలకు చేరుస్తాయి.

### బస్సుల సంఖ్యనూ పెంచాలి

పైగా మెట్రో రైళ్లకు అనుసంధానంగా ప్రయాణికుల కోసం బస్సులు నడపాల్సి వస్తోంది. అరవై కిలోమీటర్ల మెట్రో మార్గాన్ని నిర్మిస్తే అది 60 చదరపు కిలోమీటర్ల పరిధిలో ప్రయాణికులకు సేవలు అందిస్తుంది. కానీ నగర విస్తీర్ణం ఐదు వందల నుండి వెయ్యి చదరపు కిలోమీటర్ల వరకూ ఉంటుంది. అలాంటప్పుడు అవి ప్రజలకు విస్తృత సేవలు ఎలా అందించగలవు? కేవలం మెట్రోలపై ఆధారపడితే సమస్య పరిష్కారం కాదు. ఉదాహరణకు బెంగళూరులో మెట్రోను ప్రవేశపెట్టడానికి ముందు బస్సుల సంఖ్యను పెంచలేదు. ఇప్పుడు బస్సు ప్రయాణికుల సంఖ్య పడిపోయింది. అటు మెట్రో ప్రయాణికులూ పెరగలేదు. ఫలితంగా రోడ్లపై ద్విచక్ర వాహనాల జోరు కన్పిస్తోంది. కాబట్టి చౌకగా అందుబాటులో ఉండే ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేసినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయి.

# కృత్రిమ మేధస్సుతో మానవాళి వినాశనమే

### గాడ్ ఫాదర్ ఆఫ్ ఏఐ'




కృత్రిమ మేధస్సు మూడు దశాబ్దాలలోపు మానవాళి వినాశనానికి దారితీయవచ్చు. దీని సంభావ్యత 20శాతం వరకు ఉంటుందని ఏఐలో మార్గదర్శక వ్యక్తి, 2024 భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత జాఫ్రీ హింటన్ అన్నారు. ఇది కేవలం ఒక సంవత్సరం క్రితం ఆయన అంచనా వేసిన 10శాతం ప్రమాదం నుంచి పెరుగుదలను సూచిస్తుంది. గురువారం బీబీసీ రేడియో 4లో జరిగిన ఇంటర్వ్యూలో హింటన్‌ను ఏఐ అపోకలిప్స్ పదిలో ఒక అవకాశం గురించి గతంలో అంచనా వేసినప్పటి నుంచి ఏదైనా మారిందా అని అడిగారు. ట్యూరింగ్ అవార్డు గెలుచుకున్న శాస్త్రవేత్త, "నిజంగా కాదు, 10 నుంచి 20శాతం" అని ప్రతిస్పందించారు. దీని వలన షో అతిథి ఎడిటర్, మాజీ ఛాన్సలర్ సాజిద్ జావిద్, "మీరు పైకి వెళ్తున్నారు" అని హాస్యంగా అన్నారు. గత సంవత్సరం గూగుల్ నుంచి నిష్క్రమించిన కంప్యూటర్ శాస్త్రవేత్త ఇలా స్పందించారు "ఏదైనా ఉంటే మీరు చూడండి. మనం ఇంతకు ముందు ఎప్పుడూ మనకంటే తెలివైన విషయాలతో వ్యవహరించాల్సిన అవసరం లేదు." ఈ సంవత్సరం ఏఐకి చేసిన కృషికి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకున్న బ్రిటిష్-కెనడియన్ శాస్త్రవేత్త, అధునాతన ఏఐ వ్యవస్థలను నియంత్రించడంలో ఉన్న సవాళ్లను హైలైట్ చేశారు. "తక్కువ తెలివిగల విషయం ద్వారా నియంత్రించబడుతున్న మరింత తెలివైన విషయం గురించి మీకు ఎన్ని ఉదాహరణలు తెలుసు? శిశువు తల్లిని నియంత్రించడానికి పరిణామం చాలా కృషి చేసింది. కానీ అది నాకు తెలిసిన ఏకైక ఉదాహరణ" అని 'ఏఐ గాడ్‌ఫాదర్' హింటన్ అన్నారు. "మిమ్మల్ని, మూడు సంవత్సరాల పిల్లవాడిలా ఊహించుకోండి. మనం మూడు సంవత్సరాల పిల్లవాడిగా అవుతాము" అని ఆయన సూచించారు. అది "ప్రజల కంటే తెలివిగా ఉంటుంది".పురోగతి "నేను ఊహించిన దానికంటే చాలా వేగంగా" ఉందని హింటన్ గుర్తించారు. భద్రతను నిర్ధారించడానికి నియంత్రణ కోసం పిలుపునిచ్చారు. కార్పొరేట్ లాభాపేక్ష ఉద్దేశాలపై మాత్రమే ఆధారపడకూడదని ఆయన హెచ్చరించారు. "ఆ పెద్ద కంపెనీలు భద్రతపై మరిన్ని పరిశోధనలు చేయమని బలవంతం చేయగల ఏకైక విషయం ప్రభుత్వ నియంత్రణ" అని పేర్కొన్నారు. మే 2023లో, సెంటర్ ఫర్ ఏఐ సేఫ్టీ హింటన్ సహా ఈ రంగంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు సంతకం చేసిన ఒక ప్రకటనను విడుదల చేసింది. "మహమ్మారి, అణు యుద్ధం వంటి ఇతర సామాజిక-స్థాయి ప్రమాదాలతో పాటు ఏఐ నుంచి సంభవించే అవకాశమున్న వినాశకర ప్రమాదాన్ని తగ్గించడం ప్రపంచ ప్రాధాన్యతగా ఉండాలి" అని హెచ్చరించింది. సంతకం చేసిన వారిలో టెస్లా సీఈఓ ఎలోన్ మస్క్, ఆపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వోజ్నియాక్, నాడీ నెట్‌వర్క్‌లపై తన పనికి ఏఐ మార్గదర్శకుడిగా పరిగణించబడే యోషువా బెంగియో ఉన్నారు.ఏఐ వ్యవస్థలు చివరికి మానవ మేధస్సును అధిగమించగలవని, మానవ నియంత్రణ నుంచి తప్పించుకోగలవని, మానవాళికి వినాశకరమైన హాని కలిగించగలవని హింటన్ విశ్వసిస్తున్నారు. ఏఐ భద్రత, నైతిక వినియోగాన్ని నిర్ధారించడానికి గణనీయమైన వనరులను కేటాయించాలని, చాలా ఆలస్యం కాకముందే చురుకైన చర్యల తక్షణ అవసరాన్ని కూడా ఆయన సూచించారు. మెటాలోని చీఫ్ ఏఐ సైంటిస్ట్ యాన్ లెకున్ హింటన్ అభిప్రాయాలకు విరుద్ధంగా అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సాంకేతికత "వాస్తవానికి మానవాళిని అంతరించిపోకుండా కాపాడగలదు" అని పేర్కొన్నారు.

# ఈశ్వర్ అల్లా తేరానామ్..!

### నేడు దేశంలో బీజేపీ బాపుజీపై చూపుతున్న గౌరవం కానీ, ఒలకపోస్తున్న ప్రేమ కానీ చూస్తుంటే "పైపై సొగసులు కల్ల సుమా! లోపలిదంతా డొల్ల సుమా! నిజం తెలియమని నేనంటాను




లేదా కొంపే గుల్ల సుమా!" అన్న దాశరథి కృష్ణమాచార్య కవితా వాక్కులు గుర్తుకు రాకమానవు. నిన్న (సోమవారం) మహాత్మాగాంధీ 76వ వర్ధంతి సందర్భంగా బాపు ఘాట్‌కు ప్రధానమంత్రి దగ్గర నుంచి చోటామోటా నేతల వరకు క్యూ కట్టి నివాళులర్పించి, అక్కడ జరిగే సామూహిక ప్రార్థనల్లో కూడా పాల్గొన్నారు. వాళ్లే నిన్నటికి నిన్న పాట్నాలో నిర్వహించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో మహాత్ముడిపై ద్వేషాన్ని వెల్లకక్కారు. భోజ్‌పురి గాయకురాలు దేవి గాంధీజీకి అత్యంత ప్రీతిపాత్రమైన 'రఘుపతి రాఘవ రాజారామ్' భజనను ఆలపిస్తున్న తరుణంలో అందులో 'అల్లా' అన్న పదం వచ్చిందన్న కారణంతో ఆమెను కమల దళం అడ్డుకున్నది. కేంద్ర మాజీ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే సహా పలువురు నాయకులు ఆమె నుండి మైక్రోఫోన్ లాక్కొని జైశ్రీరాం అంటూ నినాదాలు చేయడం గర్హనీయం. అల్లా పేరును ఉచ్ఛరించి నందుకు క్షమాపణ చెప్పాలంటూ ఆమెపై ఒత్తిడి తెచ్చి మరి చెప్పించారు. 'జై సీతారామ్'కు బదులు 'జై శ్రీరాం' అని నినదించాలని ఒత్తిడి తెచ్చారని ఆమె వాపోయారు. 'ఈశ్వర్ అల్లా తేరానామ్, సబ్‌కో సమ్మతి దేభగవాన్' అని పాడుకున్న జాతిపిత గుండెలను తుపాకీ గుండుతో చీల్చిన గాడ్సే వారసులకు ఆ గీతంలో విద్వేషం కాక ఐక్యత కనబడాలని ఆశించడం అత్యాశే అవుతుంది. ఈ దేశంలో ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని కాంక్షిస్తూ మహాత్ముడు 'రఘుపతి రాఘవ రాజారామ్' భజన గీతానికి 'ఈశ్వర్ అల్లా తేరే నామ్, సబ్‌కో సమ్మతి దేభగవాన్' అన్న వాక్యాలను జోడించారు. సూమారు వంద ఏండ్లకు ఆ గీతంలోని 'అల్లా' అన్న పదం కేంద్రపాలకులను కలవరపాటుకు గురిచేస్తోంది. మహాత్ముడి సత్యాహింసలు, సత్యాగ్రహ సూత్రాలు ప్రపంచ ప్రాచుర్యం పొందినట్టుగానే, నిన్నటి విద్వేషాన్ని కూడా ప్రపంచ మీడియా చర్చిస్తున్నది. కానీ అధర్మం, అసత్యం రాజ్యమై సత్యాలోచనలను అణచివేస్తున్నది. అన్ని మతాల ప్రజలు అన్నదమ్ము లుగా సహనంతో జీవించాలని ఘోషించినందుకు ఆనాడు మతోన్మాదికి ఆగ్రహం తెప్పించింది. స్వేచ్ఛ, సమానత్వాలను కోరుకున్నాడు గాంధీ. ఇవేవీ గాడ్సే భావానుచరులకు మింగుడుపడని విషయాలు. అందుకే వాళ్లిప్పుడు సత్యం, న్యాయం, సమానత్వం గురించి మాట్లాడే వారిని అణచివేసే హతమార్చే పనిలో ఉన్నారు. అందుకు అనేక ఉదాహరణలు న్నాయి."యూపీ మే కాబా?" అని ఉత్తరప్రదేశ్‌లో ప్రజల బాధలను, రాజకీయుల దుర్మార్గాలను, సామాజిక పరిస్థితులను వ్యంగ్యంగా గానం చేసిన భోజ్‌పురి జానపద గాయని నేహాసింగ్‌కు నోటీసులిచ్చి నానా యాగీ చేసింది యోగీ సర్కార్. ఎవరు గొంతు విప్పినా వీరు నిర్భంధకాండకు పూనుకుంటున్నారు. ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. మత సామరస్యత పోయి, మత విద్వేషం, మానవతా విధ్వంసం పెల్లుబుకుతున్న సందర్భాన శాంతి, అహింసల గాంధీతత్వాన్ని చర్చించటం సాహసమే. మన దేశ సామాజిక సాంస్కృతిక బహుళత్వాన్ని అర్థం చేసుకుని, ఐక్యతను సాధించాలని తపన పడిన నాయకుడు గాంధీజీ. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర, ప్రజలను ఏకం చేసిన తీరు చరిత్రలో నిలిచిపోయే ఒక అధ్యాయం. కానీ నేడు ఆ చరిత్రనూ కనుమరుగు చేసే ప్రయత్నాలూ జోరుగా సాగుతున్నాయి. ఆయన ఆలోచనలపై ఆచరణపై భిన్నమైన అభిప్రాయాలెన్ని ఉన్నప్పటికీ నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకూ, భిన్నత్వంలో ఏకత్వానికి ముంచుకొస్తున్న ముప్పుకూ ఆనాటి విద్వేష హింసాలోచనల పరంపరనే. ఇప్పుడదే ఉన్మాదం సామూహిక విపత్తుగా పరిణమించిందన్న వాస్తవాన్ని మనం అర్థం చేసుకోవాలి. వాళ్లు వేటినీ వొదలటం లేదు. విద్యను కాషాయీకరించటమే కాదు, విద్యార్థులనూ, ఉపాధ్యాయులనూ మార్చేందుకు బలమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. చైతన్యయుతమైన తెలంగాణ నడిబొడ్డున అయ్యప్పమాలలో ఉన్న విద్యార్థికి పొరపాటున ప్రధానోపాధ్యాయుడి కాలు తగిలిందన్న కారణంతో మతోన్మాదులు రెచ్చిపోయారు. దళిత ఉపాధ్యాయుడిపై కక్షగట్టింది అక్కడి మతతత్వం. బలవంతంగా ఆ గురువుతో విద్యార్థి కాలుపట్టించి క్షమాపణలు చెప్పించటం గమనిస్తే, మన విద్యా వ్యవస్థలోకి మూఢత్వ విద్వేషం ఎలా దూసుకొస్తుందో తేటతెల్లమవు తోంది. ఇది కేవలం ఒక సంఘటనగానే అర్థం చేసుకోలేము. రాబోయే కాలంలో విజ్ఞానానికి, స్వేచ్ఛకు, విద్యార్థులకు, విద్యా వికాసానికి ఎన్ని అడ్డంకులు రానున్నాయో తెలిపే సూచిక కూడా. రామరాజ్యమని చెప్పుకునే పాలకుల కాలంలో ఈ ఘటనలు ఆశ్చర్యపర్చవు. కానీ, కళాకారులు, రచయితలు, మేధావులు గొంతెత్తాల్సిన అవసరాన్ని ఇలాంటి సంఘటనలు ఎరుకపరుస్తున్నాయి.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com